
అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి
1
ఆదివారం 26 ఫిబ్రవరి 2023

రాష్ట్ర సాంకేతిక టీం గ్రామాల పరిశీలన

నవతెలంగాణ-మోతె

మండలపరిధిలని కూడలి, తుమ్మగూడెం, కరక్కాయలగూడెం గ్రామాలను శనివారం రాష్ట్ర సాంకేతిక నిపుణుల కమిటీ బృందం పర్యటించింది.గతంలో ఈ గ్రామాలను కేంద్ర సాంకేతిక నిపుణుల కమిటీ బృందం పరిశీలించిన విషయం విధితమే.తిరిగి రాష్ట్ర సాంకేతిక నిపుణులబృందం ఈ పనుల్లో నిజం ఉందా లేదా అని కమిటీ సభ్యులు సందర్శించి తెలుసుకున్నారు.ఊట కుంటలు, చెపల చెరువులు, శ్మశానవాటికలు, శ్రీరామసాగర్ కాలువలను సందర్శించి పనులను విచారణ చేశారు.ఈ కార్యక్రమంలో నిపుణులు సర్పంచులు,ఎంపీడీఓ వెంకటాచారి, ఎంపీఓ హరిసింగ్‌నాయక్ ,ఏపీఓ నగేష్, ఈసీ శ్రీనివాస్, టీఏలు రాంబాబు, మధు, రామయ్య, సురేష్, శ్రీహరి పాల్గొన్నారు.

దుర్గాదేవి పూజలో రఘునందన్‌రెడ్డి

నవతెలంగాణ-తిరుమలగిరి

తిరుమలగిరి మండలంలోని తాటిపాముల గ్రామంలో శ్రీ దుర్గామాత మూడో వార్షికోత్సవ పండుగ సందర్భంగా బీఆర్ఎస్ మండలఅధ్యక్షులు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఈ పూజల వల్ల దుర్గామాత ఆశీస్సులు గ్రామ ప్రజలందరికీ కలగాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దూపటిఅంజలి రవీందర్, ఎస్టీ సెల్ మండలఅధ్యక్షులు యాకుబ్‌నాయక్,మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కారుపోతుల అంజయ్య,సర్పంచ్ ఎర్రశోభ శ్రీనివాస్,ఉపసర్పంచ్ నాయిని మల్లయ్య,శాఖ అధ్యక్షులు చెరుకు సోమయ్య,కాకర్ల రమేష్ పొట్టి సురేష్,బీఆర్ఎస్ తాటిపాముల నాయకులు కోటగిరి నరేష్‌గౌడ్, పాలబిందెల రాజు, శ్రీను పాల్గొన్నారు.



బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

- సీపీఐ(ఎం) బస్సు యాత్ర మార్చి 18న ప్రారంభం
- మార్చి 1 నుండి 3వరకు మిర్యాలగూడలో గిరిజన మహాసభలు
- జిల్లా కార్యదర్శి వర్గ సమావేశంలో జూలకంటి రంగారెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ

బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, అందుకు నిరసనగా తెలంగాణలో మార్చి 18 నుండి బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవనంలో శనివారం నిర్వహించిన జిల్లా కార్యదర్శి వర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బస్సు యాత్రలో భాగంగా నల్లగొండ జిల్లాలో జరిగే సభలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల సంక్షేమ పథకాలను రోజురోజుకు విస్మరిస్తూ పెట్టుబడిదారులను, కార్పోరేట్ పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఈ దేశంలో ధనవంతులు ఇతర దేశాలలో దోచిపెట్టిన నల్లధనాన్ని తీసుకొస్తానని చెప్పి తొమ్మిదేండ్లు కావస్తున్నా ఆ విషయాన్ని మర్చిపోయి తిరిగి 14 లక్షల కోట్ల రూపాయలు రాయితీ బడా పెట్టుబడిదారులకు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని ప్రతిష్ట పరచాల్సిన మోడీ గత బడ్జెట్ కంటే ఈ బడ్జెట్‌లో ఇంకా తగ్గిస్తూ నిధులు కేటాయించడం దుర్మార్గమని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ చెప్పినట్టుగా నడుస్తుందని, ప్రజల పట్ల ప్రేమ, మమకారం లేదని, హిందూ పేరుతో రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. గుజరాత్ లాంటి రాష్ట్రంలో ఏడు సార్లు అధికారంలోకి వచ్చిన అక్షరాస్యతలో ఆ రాష్ట్రం ఇంకా వెనకబడి ఉందని తెలిపారు. దేశంలో బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల్లో ఇతర రాజకీయ పార్టీల ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసి తొమ్మిది రాష్ట్రాల్లో అధికారంలోకి రావడం జరిగిందని గుర్తు చేశారు. మతోన్మాద ఆర్ఎస్ఎస్, బీజేపీ రాజకీయాలను ఓడించాల్సిన అవసరం కమ్యూనిస్టు పార్టీలకు, ప్రజాతంత్ర శక్తులకు ఉందన్నారు. మార్చి నెలలో జరిగే క్యాంపెయిన్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రలు జరుగుతాయని, గ్రామ గ్రామాన బీజేపీ విధానాలను ఎండగడుతూ ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మార్చి 1న మిర్యాలగూడలో జరిగే గొప్ప బహిరంగ సభను జయప్రదం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభలో అఖిలభారత నాయకురాలు, మాజీ పార్లమెంట్ సభ్యురాలు బృందాకరత్, ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు తమ్మినేని వీరభద్రం, మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి, భద్రాచలం పార్లమెంట్ మాజీ పార్లమెంట్ సభ్యులు మీడియం బాబురావు, ఇతర ప్రజాసంఘాల రాష్ట్ర నేతలు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నారి ఐలయ్య, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, నాగిరెడ్డి, సీహెచ్.లక్ష్మీనారాయణ, కందాల ప్రమీల, పాలడుగు ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

అద్భుతం..ఆహ్లాదం

ఏకో అర్బన్ పార్కు

- 250 ఎకరాల్లో సుందరంగా ఏర్పాటు
- ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేయనున్న అర్బన్ పార్కు

అందమైన అటవీ ప్రాంతం.. పచ్చని వృక్షాలు ..పక్షుల కిలకిలరాగాలు ..జంతువుల అరుపులు.. నెమళ్ల నాట్యాలు.. చెంగు చెంగున గంతులు వేసే జింకలు.. కుందేళ్లు... ప్రకృతి ప్రేమికులను కనువిందు చేయనున్నాయి .ఈ పార్క్‌ను 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో రూ.10 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు.





నవతెలంగాణ-పెద్దవూర

నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో తిరుగుతూ ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు పార్కును ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు చురుకుగా సాగుతున్నాయి. పెద్దవూర మండలం పొట్టిచెలిమ నెల్లికల్ గ్రామాల శివారులోని అటవీ ప్రాంతంలో రకరకాల జంతువులు ఆవాసం ఏర్పర్చుకున్నాయి .ఈ అటవీ ప్రాంతం సుమారు 250 ఎకరాల్లో ఉంది. అయితే ఈ ప్రాంతాన్ని ఏకోఅర్బన్ పార్కుగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

రూ.70 లక్షలతో అభివృద్ధి పనులు

నాగార్జున సాగర్ హైదరాబాద్ జాతీయ రహదారి పై పొట్టిచెలిమ వద్దప్రకృతి ప్రేమికులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉంది అటవీ ప్రాంతంలో రూ.70లక్షలతో ప్లాంటేషను,మెయిన్ గేట్ ఏర్పాటు చేశారు.3.5 ,కిలోమీటర్లు ,యూ పాయింట్ వరకు నెల్లికల్ అడ్డరోడ్డు నుండి, యూ పాయింట్ వరకు మూడు కిలోమీటర్లు మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు. పార్కులో ఒక గజాబ, ఒక యూ పాయింట్ సోలార్ బోరు ఏర్పాటు చేసి 50 వేల వివిధ రకాల మొక్కలు నాటారు. ప్రకృతి ప్రేమికులను ఆహ్లాదపరిచే విధంగా తీర్చి దిద్దుతున్నారు. స్కూల్ పిల్లలను స్టడీ టూర్ లాగా కుడా ఉపయోగకరంగా ఉంది. జీవశాస్త్రంలో మొక్కలు, పక్షులు ,జంతువుల గురించి విద్యార్థులకు టీచర్లు చెప్పినట్లుగా అన్నిరకాల పక్షులు జంతువులు ఇక్కడ కనువిందు చేస్తాయి

50 అడుగుల ఎత్తైన వాచ్ టవర్ ఏర్పాటు

అర్బన్ పార్క్‌లో ఇప్పటికే పలు నిర్మాణాలు పూర్తయ్యాయి 50 అడుగుల ఎత్తైన వాచ్ టవర్ ప్రధాన ద్వారం నుంచి అడవీలోకి వెళ్లేందుకు మూడు రోడ్లు ఏర్పాటు చేశారు. లోపల తిరిగేందుకు చిన్న చిన్న పిల్లదారులు ఏర్పాటు చేయనున్నారు.

పార్కు చుట్టూ వసతులు ఏర్పాటు

పార్కు చుట్టూ వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిన్న పిల్లలు ఆడుకునేందుకు వీలుగా పార్క్, మూత్రశాలలు.. అక్కడక్కడ సేదతీరేందుకు హూడ్ టైఫ్ సిమెంటుతో తయారు చేసిన కూర్చీలు ఏర్పాటు చేయనున్నారు. ప ర్యాట కు ల సౌకర్యార్థం నీటి వసతి కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.



త్వరలోనే పార్క్ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తాం

ఎఫ్‌డీఓ సర్వేశ్వర్ రెడ్డి

ఎపుడెప్పుడాని ఎదురు సూస్తున్న అర్బన్ పార్కును త్వరలోనే పర్యాటకుల కు అందుబాటులో ఉంచుతాం పర్యాటకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బెంచీలు, తాగునీటి వసతులు ఏర్పాటు చేస్తాం.

మురళీకృష్ణ అలంకరణ సేవలో లక్ష్మీనరసింహుడు



- వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ -యాదగిరిగుట్ట

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఐదవ రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నిత్యారాధనల అనంతరం లక్ష్మీ నరసింహ స్వామిని మురళీకృష్ణుడిగా అలంకరించి ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో యజ్ఞచార్యులు, ఉప ప్రధానార్చకులు, అర్చక బృందం, పారాయనీకులు అత్యంత వైభవంగా ఆలయ ప్రాకారములలో ఊరేగించారు. భగవానుడు అవతరించిన అవతారాల్లో దుష్ట శిక్షణ గావిస్తూ శిష్ట రక్షణ గావించిన అపూర్వమైన అవతారమే శ్రీకృష్ణ అవతారం. ఈ వేడుకలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, కార్యనిర్వహణాధికారి ఎన్ .గీత తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం శ్రీదేవి నృత్యాలయం చెన్నై, మంజుల రామస్వామి కళాకారులచే భరతనాట్య ప్రదర్శన చేశారు. శివప్రసాద్, మొండలిన్, యూపీ రాజు లచే ఈలపాట సంగీత కచేరి నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కొండపైన బస్టాండ్ వద్ద, కొండ క్రింద కళ్యాణకట్ట వద్ద ఉచిత వైద్య శిబిరము నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వంశీకృష్ణ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌కు సన్మానం

నవతెలంగాణ-అర్వపల్లి

మండలకేంద్రంలోని శ్రీ యోగానంద లక్ష్మీనర్సింహా స్వామి ఆలయ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే గాదరి కిషోం "కుమార్ సీఎం కేసీఆర్‌తో బడ్జెట్‌లో రూ.5 కోట్ల నిధులను కేటాయించేందుకు కృషి చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శనివారం ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.సీఎం కేసీఆర్‌చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. మండలకేంద్రం నుండి సూర్యాపేట వైపు వెళ్తున్న ఎమ్మెల్యేను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు.గ్రామస్తులు, నాయకులు పూలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ మన్నె రేణుక లక్ష్మీ నర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, ఆలయ చైర్మెన్ చిల్లంచర్ల విద్యాసాగర్, మండల అధ్యక్షులు గుండగాని సోమేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మెన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు మొరిశెట్టి ఉపేందర్, సర్పంచులు బైరబోయిన సునీత రామలింగయ్య, పుష్పాల శేఖర్, ఉగ్ర ఉపేంద్ర ,పెరుమాళ్ల పద్మవెంకటయ్య పాల్గొన్నారు.



ఆధునికంగా సౌకర్యవద్దంగా ప్రభుత్వ పాఠశాలలు రూపొందిస్తాం

- రాష్ట్ర విద్యాశాఖ సెక్రెటరీ వాకాటి కరుణ

నవతెలంగాణ- బీబీనగర్

రాష్ట్రంలో ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ఆధునికంగా సౌకర్యవంతంగా ప్రభుత్వ పాఠశాలలను రూపొందిస్తామని రాష్ట్ర విద్యాశాఖ సెక్రెటరీ వాకాటి కరుణ అన్నారు. శనివారం మండలంలోని మక్తానంతరం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలోని నిర్వహించిన తల్లిదండ్రుల అవగాహనా సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి పెరిగేందుకు విద్యాబోధనలో ఏ విధంగా చేయాలనే విషయంలో అనేక మార్గాల ద్వారా కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్ కి అభినందనలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో దిశా దశ నిర్దేశంతో రూపుదిద్దుకున్న మన ఊరు -మన బడి, మొదటి విడత కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో 9 ప్రభుత్వ పాఠశాలలో వచ్చే మార్చి 31 లోగా 12 అంశాలకు సంబంధించి అనేక వసతులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు, తల్లిదండ్రులు తమ పిల్లల మీద పెట్టే శ్రద్ధతో వారిలో మహా వ్యక్తులు తయారవుతారన్నారు. విద్యార్థులకు అందించే అందుబాటు, తోడ్పాటును బట్టి వారి పెరుగుదల వికాసం ఉంటుందన్నారు. తమ పిల్లలకు చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. వారికి కనీస సమయం కేటాయించాలని పిల్లలకు విలువలతో కూడిన జీవితాన్ని సాధించాలంటే వారి బంగారు భవిష్యత్తుకు ఊతగా నిలబడాలని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ సెక్రెటరీ హరిత మాట్లాడుతూ విద్య కోసం జిల్లా కలెక్టర్ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు, తొలిమెట్టు కార్యక్రమం గత జూన్ నుంచి ప్రారంభించడం జరిగిందని తెలిపారు, విద్యార్థులు చదవడం, రాయడం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేల సత్పతి, అడిషనల్ కలెక్టర్ ధిపక్ తివారి, జిల్లా విద్యాధికారి నారాయణరెడ్డి, ఎంపిపి సుధాకర్ గౌడ్, జెడ్పిటిసి గోళి ప్రణీత పింగళ్ రెడ్డి, సర్పంచ్ లావణ్య శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీవాణి, అధికారులు ఆండాళు,ఎస్ఎంసి చైర్మన్ వెంకటేష్, జిల్లా సైన్స్ అధికారి భరణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్వీ రామరాజు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



నిరుద్యోగ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

- జాబ్ మేళాకు కదంతొక్కిన నిరుద్యోగయువత
- 72 కంపెనీలు 9 వేల ఉద్యోగాలకు ఎంపికలు

నవతెలంగాణ-కోదాడరూరల్

నిరుద్యోగ నిర్మూలనే బీఆర్ఎస్ ప్రభుత్వలక్ష్యమని, నగరాలకు వెళ్లి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు వెతుక్కోలేక ఇబ్బందులు పడుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటి ముంగిటకు ప్రముఖ పలు రకాల సాఫ్ట్‌వేర్ కంపెనీలను ఆహ్వానించి వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పించిన కన్మంత్‌రెడ్డి శశిధర్‌రెడ్డి అభినందనీయులని మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రెడ్డి అన్నారు.శనివారం పట్టణంలోని పెరికభవన్‌లో ఆ పార్టీ నియోజక వర్గ మాజీ ఇన్‌చార్జి శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు.బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ నిర్మూలన లక్ష్యంగా పనిచేస్తుందన్నారు.మేళాకు సుమారు పదివేల మంది విద్యార్థులు హాజరైనరని సుమారు 3 వేలకు పైగా ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఏడు వేలకు పైగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. ఇంకా అనేకమంది నిరుద్యోగులకు ఈనెల చివరి వరకు కూడా వారికి ఫోన్లు చేసి వారికి ఉద్యోగాలు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.విద్యా అర్హతలు ఉండి కూడా సమాచార లోపంతో ఎంతోమంది విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారన్నారు.ఇటువంటి తరుణంలో స్థానికంగా జాబ్‌మేళాను నిర్వహించి గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన శశిధర్ ండ్డి ఆలోచన ప్రశంసనీయమన్నారు.జాబ్ మేళా నిర్వాహకులు నిరుద్యోగ యువత పాలిటి ఆశా జ్యోతిరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలు పిల్లల భవిష్యత్ మీదనే ఆధారపడి ఉంటాయన్నారు.కోదాడ నియోజకవర్గ ప్రాంతంలో వేలాదిమంది ఉన్నత విద్యార్హతలు పూర్తి చేసిన విషయం గమనించి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ జాబ్ మేళా ఏర్పాటు చేశానన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్నేని వెంకటరత్నంబాబు,డీసీసీబీ మాజీ చైర్మెన్ ముత్తవరపు పాండురంగారావు, సీపీఐ సీనియర్ నాయకులు దొడ్డ నారాయణరావు, బీఆర్ఎస్ నాయకులు వనపర్తి లక్ష్మీనారాయణ, బీఎస్పీ ఈసీ సభ్యులు పిల్లుట్ల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు ఓరుగంటి ప్రభాకర్, ఎస్వీ విద్యాసంస్థల చైర్మెన్ ఎం.సైదేశ్వర్‌రావు, సీపీఐ(ఎం) నాయకులు బుర్రి శ్రీరాములు, బీజేపీ నాయకులు బొలిశెట్టి కృష్ణయ్య, కౌన్సిలర్లు తిప్పిరిశెట్టి సుశీల రాజు, పెండెం వెంకటేశ్వర్లు, బేతవోలు సర్పంచ్ వట్టికూటి చంద్రకళ నాగయ్య, గుండపనేని పద్మ మధుసూదన్, మాజీ ఎంపీటీసీ గరిని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సంపూర్ణ ఆరోగ్యం కోసం ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

నవతెలంగాణ-కోదాడరూరల్



సంపూర్ణ ఆరోగ్యం కోసం ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు.శనివారం పట్టణంలోని గునుగుంట్ల అప్పయ్య ఫంక్షన్‌హాల్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు,సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.తెలంగాణ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు మెరుగు పరిచామన్నారు.పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసి వైద్యం ప్రజల ముంగిటికి తెచ్చామన్నారు.వైద్య సిబ్బంది అంకితభావంతో పని చేయాలన్నారు. కరోనాకాలంలో వైద్య సిబ్బంది సేవలు చిరస్మరణీయం అన్నారు. ఖాళీగా ఉన్న వైద్య పోస్టులు సిబ్బంది పోస్టులు భర్తీ చేస్తామన్నారు.ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం కార్యక్రమానికి హాజరైన వైద్య సిబ్బంది అందరికీ మల్లన్న కానుక అందజేశారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ కోటాచలం, డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్, డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి, ఎంపీపీలు చింత కవిత రాధారెడ్డి, యాతాకుల జ్యోతి మధుబాబు, చుండూరు వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్‌కే రాష్ట్ర యూనియన్ ప్రధాన కార్యదర్శి సుదర్శన్, జిల్లా అధ్యక్షులు సైదులు, ప్రధానకార్యదర్శి మధుబాబు, డాక్టర్ చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు చందు నాగేశ్వరరావు, తొగరు రమేష్, ఎలక నరేందర్‌రెడ్డి,పట్టణ కౌన్సిలర్లు కల్లూరి పద్మజ, మేధార లలిత, శ్రవణ్, వెంకట్,మామిడి రామారావు, నాయకులు,డాక్టర్లు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



నిమ్మకు నీరెత్తినట్టుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

నవతెలంగాణ-గరిడేపల్లి

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నా పరిష్కారించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెట్టితట్టుగా వ్యవహరిస్తు న్నాయని సీఐటీయూ జిల్లా నాయకులు షేక్ యాకుబ్ విమర్శించారు.రాష్ట్ర వ్యాప్తంగా మార్చి ఒకటి నుంచి 3 వరకు జరగబోయే సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలో కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు.నూతన జాతీయ విద్యా విధానం ద్వారా ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసినందుకు ప్రభుత్వం కుట్ర పండుతుందన్నారు.సమ్మెలో అంగన్వాడీ ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కాంట్రాక్ట్ పోస్టులకు 3న ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిన నియామకం కోసం మార్చి 3వ తేదీన ఉదయం 11 గంటలకు ప్రిన్సిపల్ ప్రభుత్వ మెడికల్ కళాశాల నల్లగొండ నందు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ టీ.వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల, నల్లగొండ యందు డాక్టర్ విభాగములో బోధన సిబ్బంది ప్రొఫెసర్ (1), అసోసియేట్ ప్రొఫెసర్ (13), కాంట్రాక్ట్ (తాత్కాలికంగా) పద్ధతిపై ఒక సంవత్సరానికి పనిచేయుట ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను మార్చి 2 వ తేదీ ఉదయం 10 గంటల లోపు ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల, ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రక్కన, గొల్లగూడ, నల్లగొండ నందు అందజేయాలని పూర్తి వివరాలు www.dme.telangana.gov.in, www.gmcnalgonda.in వెబ్ సైట్‌లో ఉంచినట్టు తెలిపారు.

పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్సీ అలుగుబెల్లి

నవతెలంగాణ-చిట్యాల



చిట్యాల మండలం ఆరెగూడెం గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి శనివారం సందర్శించారు. పాఠశాలలో ప్రస్తుతం జరుగుతున్న మన ఊరు మన బడి పనుల పురోగతిని సర్పంచ్ ఆరూరి లాలమ్మ స్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అంగన్వాడీ భవనాల మంజూరుకు కృషి చేయాలని సర్పంచ్ ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేశారు.

నేరస్తులను ఫాస్ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలి

●వీసీ,రిజిస్ట్రార్‌లను సస్పెండ్ చేయాలని నిరసన ●ఎస్పీకి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తున్న నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు



నవతెలంగాణ-నల్లగొండ

హైదరాబాద్ నగర శివారు అబ్దుల్లాపూర్ మెట్టు సమీపంలో మహాత్మా గాంధీ యూనివర్సిటీ బీటెక్ విద్యార్థి నవీన్‌ను దారుణంగా హత్య చేసి శరీర భాగాలను వేరు చేసిన హరిహరను, కాకతీయ మెడికల్ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు కారణమైన సైఫ్‌ను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నేతలు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు పందుల సైదులు, ఎంఎస్పీ బకరం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండ పట్టణంలోని పెద్ద గడియారం చౌరస్తాలో కాకతీయ మెడికల్ విద్యార్థిని ఆత్మహత్యకు కారణమైన సైఫ్, మహాత్మా గాంధీ యూనివర్సిటీ బిటెక్ విద్యార్థి నవీన్‌ను ప్రేమ వ్యవహారంలో హత్య చేసిన హరిహరల కిరాతకాలను నిరసిస్తూ ఐక్య విద్యార్థి యువజన సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. అనంతరం జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం ఇవ్వడానికి నేతలు వెలుతున్న క్రమంలో పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. ఈ క్రమంలో నాయకులను అరెస్ట్ చేసి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ విద్యార్థిని సైఫ్ వెంటాడిన విధానం, వేధించిన వేధింపులు, బిటెక్ విద్యార్థి నవీన్‌ను హత్య చేసిన విధానం అమానవీయంగా ఉన్నాయని, ఇలాంటి దుర్మార్గాలకు ఒడిగట్టిన నిందితులను ఫాస్ట్రాక్ ఏర్పాటు చేసి 45 రోజులలోపు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితులను సరిగ్గా శిక్షించకపోవడం వల్లనే ఇలాంటి దారుణాలకు ఒడిగడుతున్నారన్నారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీలోకి కొంతమంది విద్యార్థులు మత్తు పానీయాలను, గంజాయి, గుట్కాలను సేవిస్తున్నా యూనివర్సిటీ వీసీకి గాని, రిజిస్ట్రార్‌కుగాని పట్టింపు ఉండదన్నారు. మహాత్మగాంధీ యూనివర్సిటీలో హాస్టళ్లకు బాధ్యత వహిస్తున్న వార్డెన్స్ ఏనాడు కూడా ఇలాంటి విద్యార్థులను నియంత్రించిన దాఖలాలు లేవన్నారు. యూనివర్సిటీలో మహిళా ఉద్యోగులపై అధ్యాపకులు వేధింపులకు పాల్పడినా.. విద్యార్థినిలపై విద్యార్థులు అకృత్యాలకు పాల్పడినా వీసీకి, రిజిస్ట్రార్లకు ఫిర్యాదులు చేసినా ఏనాడూ చర్యలు తీసుకోలేదని తెలిపారు. యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ల



నిర్లక్ష్యమే నేడు నవీన్ బలయ్యాడని ఆరోపించారు. కాకతీయ ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం ప్రీతి ఆత్మహత్యకు కారణం అయిందన్నారు. దేశంలో రాష్ట్రంలో రోజురోజుకు ప్రేమోన్మాదుల అఘాయిత్యాలు ఎక్కువయ్యాయని ప్రభుత్వాలు ఈ ఉన్మాదులను కట్టడి చేయడంలో విఫలమయ్యాయని చెప్పారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి బకరం శ్రీనివాస్ మాదిగ, ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందూరి సాగర్, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల శివకుమార్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు అయితగోని జనార్దన్‌గౌడ్, టీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు కొండేటి మురళి, మాల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా వినయ్, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గాదే నర్సింహ్మా, బొల్లు రవీందర్, కొంపల్లి రాము, బొజ్జ దేవయ్య, బొలుగూరి నరసింహ, కట్ట వినయ్‌కుమార్ బొల్లెపల్లి మంజుల తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

●సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల

నవతెలంగాణ-కేతపల్లి



కేతపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో శనివారం సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న సబ్ స్టేషన్‌కు ఎక్కువలోడు ఉండటంతో సమస్యతో రైతుల మోటార్లు కాలిపోతున్నాయని చెప్పారు. లోవోల్టేజ్ సమస్యను నివారించేందుకు మండలంలో మరో రెండు 33 కేవీ 11 సబ్ స్టేషన్‌లను ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలను నివారించాలని చెప్పారు. 24 గంటల ఉచిత విద్యుత్తు ఇస్తామన్న ప్రభుత్వం ప్రస్తుతం 10 గంటలైనా ఇవ్వడం లేదని, నాణ్యమైన కరెంటు కనీసం 18 గంటలైనా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుత రబీ సీజన్లో రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి రాకముందు లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి నేటికీ ఇంకా అమలు కాలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే లక్ష రూపాయల రుణమాఫీ రైతులకు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ చిన్నవెంకులు, మండల కార్యదర్శి చింతపల్లి మారయ్య, మండల కమిటీ సభ్యులు కోట లింగయ్య, లకపాక రాజు, చెరుకు సత్తయ్య, ఆది మల్ల సుధీర్, కూకుట్ల శోభన్, చెవుగోని నాగయ్య, కర్ర బాలయ్య పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డల కుటుంబాల్లో కల్యాణ కాంతులు

●కల్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేసిన శాసనమండలి చైర్మెన్ గుత్తా, ఎమ్మెల్యే భాస్కర్‌రావు

నవతెలంగాణ-మిర్యాలగూడ



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డల కుటుంబాల్లో కల్యాణ కాంతులను వెదజల్లుతున్నాయని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. ఈ పథకాలను నిరుపేద ఆడబిడ్డలు తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలో షాబునగర్‌లోని ఏఆర్సీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా 485 మంది లబ్ధిదారులకు మంజూరైన 4కోట్ల 85లక్షల 56వేల 260 రూపాయల విలువైన కల్యాణ లక్ష్మీ షాదీముబారక్ చెక్కులను నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి పకడ్బందీగా చేపడుతున్న కల్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసాగా నిలుస్తున్నాయన్నారు. జాతీయ రాజకీయాల్లో రానున్న రోజుల్లో బీఆర్ఎస్ బలమైన జాతీయ పార్టీగా మారనుందని, దీనికి ప్రజా మద్దతే కారణమని అభిప్రాయపడ్డారు. కల్యాణ లక్ష్మీ షాదీముబారక్ వంటి సంక్షేమ పథకాలను అనేక రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రశంసించారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం, కేసీఆర్ కిట్ మొదలుకొని ఆడపిల్ల పెండ్లి చేసేవరకు ఇంట్లో పెద్దన్నగా ఎంతో మంది పేద కుటుంబాలకు అండగా కేసీఆర్ నిలిచారన్నారు. కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకాలు అమల్లోకి వచ్చిన తర్వాత బాల్య వివాహాల సంఖ్య పూర్తిగా తగ్గిపోయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ తిరునగర్ భార్గవ్, వైస్ చైర్మెన్ కుర్ర విష్ణు, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ విజయసింహారెడ్డి, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో చెన్నయ్య, ఎంపీపీలు నూకల సరళ హన్మంత్‌రెడ్డి, పోకల శ్రీవిద్య, పుట్టల సునీత కృపయ, జడ్పీటీసీ ఇరుగు మంగమ్మ వెంకటయ్య, మిర్యాలగూడ పట్టణ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్‌గౌడ్, పత్తిపాటి నవాబ్, ఖాదర్, పశ్య శ్రీనివాస్ రెడ్డి, ఉదయ్ భాస్కర్ రెడ్డి, పునాటి లక్ష్మీ నారాయణ, మోసిన్ అలీ, బీఆర్ ఎస్ జిల్లా నాయకులు మధార్ బాబా, అన్నభీమోజు నాగార్జున చారి, మిర్యాలగూడ మండల రైతు బంధుసమితి అధ్యక్షుడు గడగోజు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల పాదయాత్ర ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయండి

●సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-నల్లగొండ

గ్రామపంచాయతీ కార్మికుల మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కనీస వేతనం రూ.19 వేలు ఇవ్వాలని, పర్మినెంట్ ఇతర సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి12న పాలకుర్తిలో జీపీ కార్మికుల పాదయాత్ర ప్రారంభమై 28న హైదరాబాద్‌లో ముగుస్తుంది. ఈ పాదయాత్ర ముగింపు సందర్భంగా జరిగే భారీబహిరంగ సభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ, పన్నుల వసూలు అనేక రకాల పనులు చేస్తూ సేవలందిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచకుండా రూ.8,500 వేతనంతో వెట్టి చాకిరి చేయించుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వివిధ కేటగిరీలుగా ఉన్న ఉద్యోగులను జీవో నెంబర్ 51 ద్వారా మల్టీపర్పస్ విధానాన్ని తెచ్చి కార్మికుల అనేక వేధింపులు గురి చేస్తూ పనిగంటలు సెలవులు లేకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. గత14 రోజులుగా తమ ఆరోగ్యాలను, ప్రాణాలను లెక్కచేయకుండా గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల కోసం పాదయాత్ర చేస్తుంటే ప్రభుత్వం దున్నపోతు మీద వానబడ్డ చందంగా వ్యవహరిస్తుందని తెలిపారు. పాదయాత్ర ముగిసేలోపు సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులందరికీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కార్మికులను సర్పంచులు, కార్యదర్శులు వేధింపులకు గురి చేస్తున్నారని, పంచాయతీతో సంబంధంలేని నర్సరీ ఇతర పనులు చేయిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీపీఓ ఇచ్చిన సర్క్యులర్ ఆధారంగా అందరికీ పోస్టల్ బీమా అమలు చేయాలని కోరారు. ఈ పాదయాత్ర ముగింపు సందర్భంగా జరిగే బహిరంగ సభను ప్రభుత్వానికి కళ్ళు తెరిపించేలా గ్రామపంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.



కేంద్ర బడ్జెట్ ప్రజా వ్యతిరేకం

రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బండ శ్రీశైలం

నవతెలంగాణ-మునుగోడ

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తి ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. శనివారం మునుగోడ మండల కేంద్రంలో సీపీఐ(ఎం) కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల నుండి అన్ని రకాల పన్నులు వసూలు చేస్తూ సంపన్నులకు సబ్సిడీ రూపంలో కట్టబెడుతున్నారని, కాకులను కొట్టి గద్దలకు వేసినట్టుగా కేంద్ర ప్రభుత్వ తీరు ఉందని పేర్కొన్నారు. 44 కార్మిక చట్టాలు రద్దుచేసి నాలుగు చట్టాలుగా కుదించి కార్మికులపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని మండిపడ్డారు. గతంలో మద్దతు ధర చట్టం పార్లమెంట్లో ప్రవేశపెడతామని చెప్పిన మోడీ ప్రభుత్వం ఇప్పటికి ఆ ఊసే ఎత్తటం లేదని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసనగా ఫిబ్రవరి 26, 27 తేదీలలో మండల కేంద్రాలలో బడ్జెట్ కాపీలను దహనం చేయాలని రైతులకు, కార్మికులకు, మేధావులకు పిలువునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య, జీఎంపీఎస్ జిల్లా నాయకులు వల్లూరి శ్రీశైలం, మండల నాయకులు ఎడ్ల అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయం

●రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ-చిట్యాలటౌన్



రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీఎస్పీ అధికారంలోకి వస్తున్నదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. చిట్యాల పట్టణ కేంద్రంలో శనివారం స్థానిక బీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నేషనల్ కోఆర్డినేటర్ రాజ్యసభ సభ్యులు రామ్ జీ గౌతమ్‌తో కలిసి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. బీఎస్పీ పేరు వింటేనే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు భయపడుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఎస్పీని అధికారంలోకి తీసుకురావడానికి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తున్నామని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చేస్తున్న ఇసుక మాఫియా, భూ కబ్జాలకు వ్యతిరేకంగా బీఎస్పీ పోరాడుతుందన్నారు. ఇసుక మాఫియాలో నకిరేకల్, నల్లగొండ, తుంగతుర్తి ఎమ్మెల్యేలు కలిసి 3500 కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు. ఇందులో ప్రగతి భవన్ వాటా ఎంతో సీఎం కేసీఆర్ చెప్పాలన్నారు. 700 కోట్ల రూపాయలతో నిర్మాణం చేయనున్న బ్రాహ్మణ వెల్లంల ఉదయ సముద్ర ప్రాజెక్టు ఏండ్లు గడుస్తున్న ఇప్పటి వరకు పూర్తి చేయకపోవడానికి గల కారణాలను అడిగే దమ్ము స్థానిక ఎమ్మెల్యేకు లేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ చీఫ్ కోఆర్డినేటర్ మంద ప్రభాకర్, రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటేష్ చౌహన్, గొల్ల నరేష్, జిల్లా అధ్యక్షులు పూజారి సైదులు, మహిళా రాష్ట్ర కన్వీనర్ నర్ర విమల, నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రియదర్శిని మేడి, పోకల ఎలిజబెత్, మండల అధ్యక్షురాలు పూజిత తదితరులు పాల్గొన్నారు.



గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-మిర్యాలగూడ

మార్చి ఒకటి, రెండు, మూడు తేదీలలో మిర్యాలగూడలో జరిగే తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మూడో మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) నాయకులు జటంగి సైదులు, కుర్ర సైదా నాయక్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ముందు మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చ్ ఒకటో తేదీన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహిరంగ సభకు గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర శివనాయక్, జిల్లా కమిటీ సభ్యులు హనుమంతు నాయక్, రంగానాయక్, గిరిజన సంఘం కోటినాయక్, ముదిమానిక్యం, మాజీ ఎంపీటీసీ సర్వయ్య, లలితమ్మ, కేవీపీఎస్ జిల్లా నాయకులు దేవతల సైదులు, రవినాయక్, తరుణ్ నాయక్, రాజునాయక్, నవీన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్లలో చోరీలు చేస్తున్న ముఠా అరెస్టు

●వివరాలు వెల్లడించిన ఎస్పీ అపూర్వరావు



నవతెలంగాణ-నల్లగొండ

సెల్ టవర్ సెంటర్లలో చోరీలకు పాల్పడుతున్న ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నల్లగొండ ఎస్పీ కే.అపూర్వరావు పోలీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలను వెల్లడించారు. కృష్ణ మానస కాలనీ, బలాపురం, శ్రీనివాస్ నగర్‌లలో ఎయిర్టెల్ సెల్ టవర్లలో బేస్ బాండ్, పీఆర్‌యూల చోరీ విషయంలో సదరు సెల్ టవర్ ఇన్‌చార్జి ఫిర్యాదు మేరకు మిర్యాలగూడరూరల్ ఎస్ఐ కేసులు నమోదు చేసుకొని దర్యాప్తులో బాగంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ధీరావత్ తండాకి చెందిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకొని విచారించారన్నారు. ధీరావత్ నవీన్, కొత్త సౌమ్య తండాకు చెందిన ధనావత్ కృష్ణ అలియాస్ విష్ణు, ధీరావత్ మోహన్ గత 4, 5 సంవత్సరాలుగా సెల్ టవర్లలో పని చేస్తు సెల్ టవర్ల గురించి పూర్తి అవగాహన కలిగి ఉండి, సెల్ టవర్‌లో వుండే ప్రతి ఆపరేటింగ్ సిస్టమ్, వాటి విలువ తెలిసి వాటిని గుట్టు చప్పుడు కాకుండా రాత్రి వేళల్లో సెల్ టవర్‌లలోకి ప్రవేశించి బీబీయూ, పీఆర్‌యూ, కేబుల్‌లను సులువుగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో చోరీ చేసి హైదరాబాద్‌లో ముషీరాబాద్‌కు చెందిన మహమ్మద్ జహంగీర్, దిల్సుఖ్నగర్‌కు చెందిన రజనీకాంత్ అనే వ్యాపారుల వద్ద పరికరాలను అమ్మి డబ్బు సంపాదిస్తున్నారన్నారు. చోరీలకు పాల్పడుతున్న వారిపై జిల్లాలోని మిర్యాలగూడ, త్రిపురారం, వేములపల్లి, మాడ్గులపల్లి, నిడమనూర్, తిరుమలగిరి సాగర్, పెద్దవూర, కొండ మల్లేపల్లి, దేవరకొండ, చింతపల్లి, నేరేడుగొమ్ము పోలీసు స్టేషన్ పరిధిలో కూడా సెల్ టవర్ దొంగతనాలపై కేసులు నమోదు అయినట్లు తెలిపారు. టెక్నాలజీ సహాయంతో ఆయా సెల్ టవర్‌ల వద్ద టవర్ డంప్ ఆధారంగా నిందితుల కదలికలను పరిశీలిస్తూ చోరీలకు పాల్పడిన నిందితులను అరెస్టు చేశామన్నారు. కేసును ఛేదించిన మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి ఆధ్వర్యంలో మిర్యాలగూడరూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ దోరేపల్లి నరసింహులు, సుధీర్ కుమార్, సిబ్బంది నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ కే.శ్రీనివాస్, జీ. రాజారం, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, దస్రు, అక్బర్, గోపి కేసు చేధించినందుకు జిల్లా ఎస్పీ అభినందించారు.

అనాథలకు పరీక్ష లేకుండా గురుకులాల్లో ప్రవేశం కల్పించాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ

తల్లి తండ్రులు కోల్పోయి అనాథలైన పిల్లకు పరీక్షతో సంబంధం లేకుండా ప్రవేశం కల్పించాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానికంగా మాట్లాడారు. కరోన మహమ్మారి ఎంతో మంది పిల్లలకు తల్లి తండ్రులను లేకుండా చేసిందన్నారు. అనాథ పిల్లలకు పరీక్ష గురించి అవగాహన లేక ప్రవేశ పరీక్షలో ఇతర విద్యార్థులతో సమానంగా పోటీ పడలేరన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి దాదాపు 600 గురుకుల పాఠశాలల్లో 48 వేల సీట్లు ఉన్నాయని, ప్రతి ఏటా దాదాపు లక్ష యాభై నుండి రెండు లక్షల మంది విద్యార్థులు వరకు పరీక్ష రాస్తున్నారన్నారు.పేద ప్రజలు భోజన,వసతి సౌకర్యం ఉన్న నాణ్యమైన విద్య కావాలని కోరుకుంటున్నారని అన్నారు. కాబట్టి డిమాండ్ తగ్గట్టు గురుకులాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు కోలా సైదులు ముదిరాజ్, పసుల కాశీయాదవ్, వడ్డేపల్లి వెంకటేశ్వర్లు, కొప్పోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి పేదలకు వరం

నవతెలంగాణ-నకిరేకల్

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 26 మంది లబ్దిదారులకు సహాయ నిధి నుండి మంజూరైన రూ. 9 లక్షల 50 వేల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం కేతపల్లి మండలం శాసనగుడు గ్రామానికి చెందిన దిండుగాల యాదగిరికి మంజూరైన రూ. రెండు లక్షల 50వేల ఎల్‌ఓసీ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కారును తప్పించబోయి వేప చెట్టును ఢీకొట్టిన లారీ

నవతెలంగాణ-మిర్యాలగూడ

కారును తప్పించబోయి చెట్టును లారీ ఢీ కొట్టిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి మిర్యాలగూడ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...నరసరావుపేట నుండి కందిపప్పు లోడుతో హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ పట్టణంలోని నందిపాడు బైపాస్ వద్ద ముందుగా వెళుతున్న కారును తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న వేప చెట్టును బలంగా ఢీకొట్టింది. అప్రమత్తంగా ఉన్న డ్రైవర్ లారీ నుంచి దూకడంతో అతనికి స్వల్ప గాయాలయ్యాయి. అర్ధరాత్రి ఈ సంఘటన జరగడంతో అక్కడ ప్రజలు లేకపోవడంతో పెద్ద ప్రాణా నష్టం తప్పింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మేకలకు నట్టల నివారణా మందు పంపిణీ

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

తిరుమలగిరి గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు శనివారం పశువైద్యాధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామ సర్పంచ్ ఈ అవకాశాన్ని రైతులు తప్పక వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోద ఎల్లమ్మ, ఉప సర్పంచ్ చెన్నబోయిన నాగేష్ యాదవ్, బెల్లి సింహాద్రి, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

27న జాబ్ మేళా

నల్లగొండ కలెక్టరేట్ : నల్లగొండ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రయివేట్ రంగంలో ఉద్యోగాలను కల్పించేందుకు ఈనెల 27న ఉదయం 10 గంటలకు జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎస్. పద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.10 వేల నుండి 25 వేల వరకు జీతం ఇస్తారని తెలిపారు. 10వ తరగతి నుండి డిగ్రీ చదివి, 18 నుండి 35 సంవత్సరాలలోపు వయసు గల స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు బయోడేటాతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో జాబ్‌మేళాకు హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9030206741, 7095612963 ను సంప్రదించాలన్నారు.

'ప్రీతి ఆత్మహత్య యత్నానికి కారకులపై చర్యలు తీసుకోవాలి'

నవతెలంగాణ-మిర్యాలగూడ




వరంగల్ జిల్లా కాకతీయ మెడికల్ కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదటి సంవత్సరం చదువుతున్న ధరావత్ ప్రీతి ఆత్మహత్య చేసుకోవడానికి కారకులైన సైఫ్‌తో పాటు ఫిర్యాదు చేసిన పట్టించుకోని కాకతీయ మెడికల్ కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని బంజారా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మాలోత్ దశరథ్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బంజారా ఉద్యోగుల సంఘం, బంజారా సంఘం అధ్వర్యంలో సూపరిండెంట్ హాజీకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేధింపుల విషయమై ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోని పోలీసు అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీనియర్ విద్యార్థి సైఫ్ వేధింపుల వల్లనే ప్రీతి మత్తు ఇంజక్షన్ తీసుకుందన్నారు. వేధింపుల విషయం గత డిసెంబర్ నెలలో పిర్యాదు చేసిన అటు పోలీసులు ఇటు కళాశాల యాజమాన్యం పట్టించుకోకపోవడం మూలంగా అంత తీవ్ర నిర్ణయానికి ప్రీతీ వచ్చిందని తెలిపారు. సంఘటనకు కారకులైన వారిపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థినికే రక్షణ లేకపోవడం బాధాకరమన్నారు. సంఘటనకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, చట్టాలంటే భయపడేలా మరిన్ని కఠిన చట్టాలు తీసుకరావాలని డిమాండ్ చేశారు. ప్రీతికి అత్యుత్తమమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రీతిని బతికించే భాద్యత ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం డివిజన్ నాయకులు లాస్కర్‌నాయక్, బంజారా సంఘం జిల్లా నాయకులు దీరవత్ మాన్యానాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నీలకంఠం నాయక్, జిల్లా అధ్యక్షులు ఇస్లావత్ సైదా నాయక్, యాదవ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి చేగొండి మురళియాదవ్, భరత్ రాష్ట్ర సమితి దామరచర్ల మండలం సోషల్ మీడియా కన్వీనర్ సురేష్‌నాయక్, సర్పంచ్ రవీందర్‌నాయక్, అంజయ్య గోపీనాయక్, మక్ల నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'వేముల వీరేశం చిల్లర పనులు మానుకోవాలి'

నవతెలంగాణ-కేతపల్లి



నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అభివృద్ధిని చూసి ఓర్వలేక, కనీసం పార్టీ సభ్యత్వం లేని మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం తన అనుచరులతో కలిసి మండలంలో పలు గ్రామాల్లో శిలాఫలకం పగలగొట్టడం ఫ్లెక్సీలు చింపడం లాంటివి చిల్లర పనులు మానుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి అన్నారు. కేతపల్లి మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో అరాచకం చేస్తూ నకిరేకల్‌లో తన అనుచరులతో దందాలు చేస్తూ పార్టీ ప్రతిష్ట దిగజార్చే పనులు చేయడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. మళ్లీ చిరుమర్తి లింగయ్య ఎమ్మెల్యే కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ చల్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బొప్పని సురేష్, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు, పలువురు బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ సైఫ్‌ను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-చివ్వెంల

కాకతీయ మెడికల్ కాలేజ్ పీజీ విద్యార్థిని డాక్టర్ ధీరావత్ ప్రీతిని వేధించి ఆత్మహత్యాయత్నానికి కారకుడైన పీజీ సీనియర్ విద్యార్థి సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సామాజిక న్యాయ సాధన సమితి ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు గుగులోత్ చీనా నాయక్ డిమాండ్ చేశారు.శనివారం ఆయన స్థానికంగా మాట్లాడారు.ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ప్రీతికి నిమ్స్‌లో మెరుగైన వైద్యం అందించాలని కోరారు.ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.





దాతల సహాయం మరువలేనిది

నవతెలంగాణ-చిలుకూరు

దాతల సహాయం ఎన్నటికీ మరువలేనిదని ఏఎస్ఐ పులి వెంకటేశ్వర్లు, అయోష ఫౌండేషన్ చైర్మెన్ షేక్ ఇమ్రాన్ అన్నారు.శనివారం మండలకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షాప్యాడ్స్ పంపిణీ చేసి మాట్లాడారు.అయోష ఫౌండేషన్ తరపున రాబోయే పదోతరగతి విద్యార్థినీ విద్యార్థులకు పంపిణీ చేశామన్నారు.మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు పంపిణీ చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కర్నాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-పాలకవీడు

మండలంలోని హనుమ్యగూడెం గ్రామ పంచాయతీ ఆవాస గ్రామం,బాబోజీతండా శ్రీ శ్రీ బాలాజీ దేవాలయం నిర్మాణపనులకు ఎంపీపీ భూక్యా గోపాల్‌నాయక్, స్థానిక సర్పంచ్ కందుకూరి సరిత ఇంద్రారెడ్డి, బెట్టేతండా సర్పంచ్ మాలోత్ మోతిలాల్‌నాయక్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రజల ఐక్యమత్యంతో భక్తి శ్రద్ధలతో శ్రీ శ్రీ బాలాజీ దేవాలయం నిర్మించుకోవడం చాలా సంతోషదాయకరమన్నారు.దేవాలయ నిర్మాణం త్వరగా పూర్తి కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంల ో గ్రామపెద్దలు, వార్డుసభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం

నవతెలంగాణ-తుంగతుర్తి

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు,బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్యలు అన్నారు.శనివారం మండలకేంద్రంలో తుంగతుర్తి శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్ ఆదేశాల మేరకు ఎంపీటీసీ చెరకు సృజన పరమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు.ఈ మేరకు సామాజిక బాధ్యతగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం, ప్రజలతోపాటు బాటసారుల దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచులఫోరం మండలఅధ్యక్షుడు నల్లు రామచంద్రారెడ్డి,బీఆర్ఎస్ జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, కటకం వెంకటేశ్వర్లు,గోపగాని శ్రీనివాస్‌గౌడ్, గోపగాని రమేష్‌గౌడ్, దీప్లానాయక్,బొజ్జసాయికిరణ్,బొంకూరి యల్లయ్య, నాగయ్య, మల్లేష్, సాయిరాం, సాయి, మధు, సురేష్,శేఖర్, సురేష్, మల్లికార్జున్, నితిన్,అవిలయ్య,చింటు, మనోహర్, మహేశ్, ప్రసాద్, కృష్ణ, సతీష్, ప్రభాకర్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



రూ.లక్షలోపు రుణమాఫీని అమలు చేయాలి

నవతెలంగాణ-చిలుకూరు

వెంటనే రూ.లక్ష లోపు రుణమాఫీని అమలు చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ వెంకటయ్య అన్నారు.ఈవిషయమై శనివారం మండలకేంద్రంలో తహసీల్దార్ రాజేశ్వరిదేవికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి పోర్టల్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు.రైతులకు పాత రుణాలు తీరక కొత్త రుణాలందక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో పిల్లుట్ల కనకయ్య, గంగిరెడ్డి రవీందర్‌రెడ్డి, దొడ్డ దశరథ, ఎలగొండ వెంకటేశ్వర్లు, ముత్తిరెడ్డి సైదులు, ముత్తయ్య, కాంపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మీ సేవల ద్వారా నాణ్యమైన సేవలందించాలి

నవతెలంగాణ-అర్వపల్లి

మండలంలోని ప్రజలకు మీసేవ సెంటర్ల ద్వారా నాణ్యమైన సేవలను అందించాలని తహసీల్దార్ యాదగిరిరెడ్డి అన్నారు.శనివారం ఆయన మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మీసేవ సెంటర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీసేవ సెంటర్‌లో అధికవసూళ్లకు పాల్పడవద్దని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలు మాత్రమే తీసుకోవాలన్నారు.సమయపాలన పాటించాలన్నారు. గ్రామాలను రైతులకు ధరణి వెబ్‌సైట్‌లో సమస్యల పైన తెలియజేసి వారి అప్లికేషన్‌ను సక్రమంగా ఉన్నప్పుడు ఆన్‌లైన్‌లో తగిన ఆధారం అప్లోడ్ చేసి దరఖాస్తు చేయాలన్నారు.ప్రభుత్వం సూచించిన ధరల పట్టికలను మీసేవ సెంటర్‌లో తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్ పాషా,ఆర్ఐ కర్నాకర్, జలంధర్, మీసేవ నిర్వాహకులు సత్యం, సుదర్శన్,మల్లికార్జున్, కంప్యూటర్ ఆపరేటర్లు వినయ్, సైదులు పాల్గొన్నారు.

వ్యవసాయా మోటార్లకు ఆటోమేటిక్ స్టాటర్లను తొలగించొద్దు

నవతెలంగాణ-హుజూర్‌నగర్

విద్యుత్ అధికారులు రైతులు వ్యవసాయ మోటర్లకు ఏర్పాటు చేసుకున్న ఆటోమేటిక్ స్టాటర్లను తొలగించొద్దని న్యూ డెమోక్రసీ రైతుసంఘం జిల్లా నాయకులు కాకి అజయ్ అన్నారు.శనివారం మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.సరైన నీరు దొరకనే బోర్లకు మాత్రమే రైతులు ఆటోమేటిక్ స్టాటర్లను ఏర్పాటు చేసుకున్నారన్నారు.ఇప్పుడు ఆ స్టాటర్లను తొలగిస్తే రైతులు బోర్ల వద్ద రాత్రి పగలు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు.విద్యుత్ ఎప్పుడు వస్తుందో..ఎప్పుడు పోతుందో తెలియని అధికారులు స్టాటర్లను తొలగించడం అన్యాయమన్నారు విద్యుత్ అధికారులు మొండిగా ప్రవర్తించినట్టయితే రైతుల నుండి వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మేకల నాగేశ్వర్‌రావు, గురువయ్య, వీరయ్య,పెదనాగేశ్వర్‌రావు,ప్రభు, సైదులు,నాగయ్య,రాజు,ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ సాగుతో అధికలాభాలు



నవతెలంగాణ-చివ్వెంల

రైతులు ఆయిల్‌ఫామ్ తోటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్, వ్యవసాయ అధికారి రామారావు,హార్టికల్చర్ ఆఫీసర్ జగన్ అన్నారు.మండలపరిధిలోని దురాజ్‌పల్లి గ్రామ రైతులకు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం శనివారం రైతులు డాక్టర్ ఆదుర్తి రామయ్య, విజయలక్ష్మీ, కృష్ణమోహన్ ల ఆయిల్ ఫాం ఉద్యానవన క్షేత్రాన్ని వారు సందర్శించి మాట్లాడారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఆయిల్‌ఫామ్ సాగును కలెక్టర్ సూచనమేరకు 2500 ఎకరాలలో మొక్కలు నాటాలని నిర్దేశించారన్నారు.అందులో ఇప్పటివరకు 1500 ఎకరాలలో ఆయిల్‌ఫామ్ మొక్కలు నాటడం పూర్తి చేశామన్నారు.ఇంకా 1000 ఎకరాలలో ఆయిల్ ఫామ్ తోటలు పెంచుటకు రైతులు ముందుకొచ్చారన్నారు.జిల్లా వ్యవసాయ శాఖ, జిల్లా ఉద్యానవన శాఖ సౌజన్యంతో ప్రతి శుక్రవారం రైతులకు అవగాహన కల్పించేందుకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి రైతుకు రెండెకరాలపైన ఉన్న భూమిలో బిందు సేద్యంతో ఆయిల్ ఫాం సాగుచేసుకోవచ్చని తెలిపారు.బిందు సేద్య పరికరాలు రాయితీ కేటగిరిని బట్టి ఓసీలకు 80 శాతం, బీసీలకు 90 శాతం, ఎస్సీలకు 100 శాతం వరకు రాయితీ కలదని తెలిపారు.నాలుగేండ్ల పాటు యాజమాన్య చర్యల కోసం అంతర పంటలు సాగు చేసుకున్నందుకు సంవత్సరానికి ఎకరానికి 4200రూపాయల చొప్పున నాలుగేండ్ల పాటు ఇస్తామన్నారు.రూ.193 విలువ గల మొక్క రైతుకు కేవలం 23 రూపాయలకే రాయితీగా వస్తుందన్నారు. ఆసక్తికలిగిన రైతులు ఉద్యాన అధికారులను , పతంజలి ఆయిల్ ఫాం కంపెనీ ప్రతినిధులను గాని సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చివ్వెంల వ్యవసాయ అధికారి ఆశాకుమారి, ఏఈఓ పవన్‌కుమార్, పతంజలి ఆయిల్ ఫామ్ కంపెనీ డివిజనల్ అధికారులు శశికుమార్, సుధాకర్ డ్రిప్‌ఇరిగేషన్ జిల్లా కోఆర్డినేటర్ నగేష్, పతంజలి ఆయిల్ కంపెనీ అసిస్టెంట్ వంగూరి లక్ష్మీనారాయణ, భద్రయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాలు కల్తీ చేస్తే కఠిన చర్యలు

- జిల్లా ఆహార భద్రత, తనిఖీ అధికారి కల్యాణ్‌చక్రవర్తి

నవతెలంగాణ-కోదాడరూరల్



పాలు కల్తీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార భద్రత తనిఖీ అధికారి కల్యాణ్ చక్రవర్తి హెచ్చరించారు.శనివారం జిల్లా పరిధిలో ఉన్న పాల విక్రయ కేంద్రాలను జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు పరిశీలించారు.కోదాడలోని వీఎస్‌ఆర్ , లలిత , హెరిటేజ్ లాంటి పాల కేంద్రాలలో పాల నమూనాలను సేకరించి అప్పటికప్పుడు ప్రత్యేక ఫుడ్ సేఫ్టీ వాహనం ద్వారా పరీక్షలు నిర్వహించారు. పాల నాణ్యతను పరిశీలించారు.అనంతరం ప్రత్యేక నమూనాలను తీసుకొని పరీక్షల నిమిత్తం హైదరాబాదులోని ల్యాబ్‌కు పంపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాలను కల్తీ చేసి అమ్మడం చట్ట విరుద్ధమన్నారు.పాలలో నురగ రావడానికి , కొవ్వు శాతం పెరగడానికి ఎవరైనా తప్పుడు పద్ధతులు పాటించకూడదన్నారు.స్వచ్ఛమైన సహజ సిద్ధమైన పాలని అమ్మాలని సూచించారు.ఆకస్మిక తనిఖీల్లో భాగంగా కొన్ని డెయిరీలో నమూనాలు సేకరించారు.పాలు, పాల ఉత్పత్తులు ఎవరైనా కల్తీ చేసినట్టు తెలిస్తే సమాచారం అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ డ్రైవ్ ఫుడ్ సేఫ్టీ అధికారి కృష్ణమూర్తి, రతన్‌రావు, విజయ్‌కుమార్, మల్లికార్జున్, ఖాజా, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ధరణి పోర్టర్‌లో తప్పులు సవరించాలని వినతి



నవతెలంగాణ-హుజూర్‌నగర్

ధరణి పోర్టర్‌లో ఉన్న తప్పులను వెంటనే సవరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొప్పోజు సూర్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం డిప్యూటీ తహసీల్దార్ సుధారాణికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధరణి పోర్టల్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రైతులు కాళ్లరిగేలా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోతుందన్నారు.తహసీల్దార్ కార్యాలయం వారు ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లాలని..ఆర్డీఓ కార్యాలయం వారు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాలని ,కలెక్టర్ కార్యాలయం వారు ప్రభుత్వ ఆదేశాలు రాలేదంటూ తిప్పుకుంటున్నారని విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రకటించిన విధంగా రూ.లక్ష రుణమాఫీని, ఇప్పటివరకు అయిన వడ్డీని ఏకకాలంలో మాఫీ చేయాలన్నారు.వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరం మల్లేశ్వరి,పాలకూరిబాబు,బంటు శ్రీనివాస్, గోవర్ధన్, జక్కుల రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి మిషన్ భగీరథ నీరు



నవతెలంగాణ-హుజూర్‌నగర్‌రూరల్

అన్ని గ్రామాలల్లో ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడం కోసమే సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టారని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల పరిషత కార్యాలయంలో ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అధ్యక్షతన రాబోవు వేసవి కాలానిన దృష్టిలో ఉంచుకుని మంచినీటి సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశానుసారం గ్రామాలల్లో తాగునీటి సమస్యను తీవ్రంగా పరిగణిస్తూ సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు.సర్పంచులు ,పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామాలలో గల మిషన్ భగీరథ పైపులైను లీకేజీలు, పైపులైన్ వేయని ఇండ్లకు పైపులైన్ వేయాలని, మిషన్ భగీరథ నీరు అందించాలన్నారు.ఈ సమావేశంలో సర్పంచులు కర్నాటి అంజిరెడ్డి, శాసనాల నాగసైదులు, గల్లా సైదులు, అన్నెం శిరీషాకొండారెడ్డి, శాంతకకుమారి, ఎంపీడీఓ ఎస్‌కె మౌలానా, ఎంపీఓ ఇంద్రా, గ్రిడ్ ఏఈఈ ఎస్.మహేష్, బి.సిదార్థ, పంచాయతీకార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ఆయుష్మాన్ భారత్ ఆన్‌లైన నమోదుకు విశేష స్పందన

- 3,000ల మంది రిజిస్ట్రేషన్‌ల నమోదు
- బీఆర్ఎస్ జిల్లా నాయకులు గండూరి కృపాకర్

నవతెలంగాణ-సూర్యాపేట



జిల్లాకేంద్రంలోని 45వ వార్డు విద్యానగర్లో నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ ఆయుష్మాన్ భారత్ ఉచిత నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందని బీఆర్ఎస్ జిల్లా నాయకులు గండూరి కృపాకర్ అన్నారు.శనివారం ఐదో రోజు స్థానిక విద్యానగర్ గండూరి జానకమ్మ వాటర్ ప్లాంట్ వద్ద నిర్వహిస్తున్న ఉచిత రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. నేటి వరకు 3,000 మంది ఆన్లైన్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకున్నారన్నారు.మాజంలో ప్రతి ఒక్కరికి ఆరోగ్యశ్రీ ఆయుష్మాన్ భారత్ నమోదు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో గండూరి సుధీర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు శనగాని రాంబాబు, కుమ్మరికుంట్లలింగయ్య, సుంకరిరమేష్, నాశనబోయిన భరత్, మెరుగు రమేష్, నాగాచారి, పోగుల శ్రీను, దేవరశెట్టి ప్రవీణ్, మధు, జగదీష్, సతీష్, ఇస్మాయిల్, ఎం.కల్యాణ్, నవీన్, వెంకటేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీరాఘవేంద్ర'లో ముగిసిన ఇంటర్ వొకేషనల్ ప్రాక్టికల్స్

నవతెలంగాణ-తిరుమలగిరి

మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ రాఘవేంద్ర జూనియర్ కళాశాలలో 21/02/2023 నుండి ప్రారంభమైన ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్స్ పరీక్షలు బ్రిడ్జి కోర్స్‌తో సహా 25/02/ 23 వరకు ప్రశాంతంగా ముగిశాయని దీనికి మొదటి సంవత్సర విద్యార్థులు 104 మందికి 80 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ నెల్లుట్ల రాజు తెలిపారు. ద్వితీయ సంవత్సర విద్యార్థిని విద్యార్థులు 62 మందికి 42 మంది విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు.మొదటి,ద్వితీయ విద్యార్థిని విద్యార్థులు 42 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.మొత్తం 122 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, అదేవిధంగా బ్రిడ్జ్ కోర్స్ పరీక్షలకు ఏడుగురికి అందరూ హాజరయ్యారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎక్సటర్నల్స్ పి.గణేష్, డి.భగత్‌సింగ్, కళాశాల కరస్పాండెంట్ తీగుళ్ల శ్రీనివాస్, అధ్యాపకులు వైస్ ప్రిన్సిపాల్ సంగెపాక ప్రభాకర్, దురుసోజు ఉపేందర్, మోడెపు సురేందర్, కరుణ, వేమన, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





అంబేద్కర్ బాటలో నడవాలి

నాగారం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాటలో ప్రజలందరూ నడవాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మెన్ మందుల సామేలు అన్నారు.శనివారం మండలపరిధిలోని మామిడిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న అంబేద్కర్ విగ్రహాన్ని పరిశీలించి మాట్లాడారు.బాబా సాహెబ్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా రాజ్యాంగాన్ని రచించిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు.ఆయన రాసిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని సూచించారు. మామిడిపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం నిర్మించడం అభినందించదగ్గ విషయమన్నారు.అనంతరం విగ్రహ నిర్మాణ కమిటీకి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో పేరాలసాగర్,చంద్ర, ఈశ్వర్,వీరేష్, రాజీవ్, యాదగిరి,సురేష్, శ్రీను,మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.



డిగ్రీ సెమిస్టర్ ఫలితాలలో త్రివేణి డిగ్రీ కళాశాల విజయ కేతనం

- విద్యాసంస్థల చైర్మెన్ బాణాల వసంత వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-కోదాడరూరల్

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలలో త్రివేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని వాగ్దేవి విద్యాసంస్థల చైర్మెన్ బాణాల వసంత వెంకట్‌రెడ్డి అన్నారు.శుక్రవారం మహాత్మా గాంధీ యూనివర్సిటీ విడుదల చేసిన మూడవ సెమిస్టర్, ఐదవ సెమిస్టర్ డిగ్రీ ఫలితాలలో త్రివేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు.ఈ సందర్భంగా శనివారం త్రివేణి డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన విద్యార్థుల అభినందన సభలో వెంకట్‌రెడ్డి మాట్లాడారు.మహాత్మాగాంధీ యూనివర్సిటీ శుక్రవారం ప్రకటించిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ ఫలితాలలో త్రివేణి డిగ్రీ కళాశాలలోని పలువురు విద్యార్థిని విద్యార్థులు అత్యధిక ఎస్జీపీఏ గ్రేడ్ పాయింట్ సాధించి యూనివర్సిటీ స్థాయిలో విజయకేతనం ఎగరవేశారన్నారు.అనంతరం అత్యధిక ఎస్‌జీపీఏ సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.అత్యధిక ఎస్‌జీపీఎస్ సాధించిన విద్యార్థులు ఆవుల త్రివేణి-10/10, యు హర్షిత 9.88, కే ప్రసన్న 9.84, వి సాయి చందన 9.80, డి సస్మిత 9.72, కె ప్రత్యూష 9.72, వి.తేజ 9.72, కె.లక్ష్మీప్రసన్న 9.64, ఎస్.హారిక 9.57, ఎండి తయ్యబా 9.52, డి.లక్ష్మీదుర్గ 9.48, బి కావ్య 9.40 ఉన్నారు. అనంతరం వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ విద్యార్థులపై ఏబీవీపీ దాడిని ఖండించండి

నవతెలంగాణ-సూర్యాపేట

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికలో ఎస్ఎఫ్ఐ ఫ్యానెల్ ఎన్నికల పోస్టర్లును ఏబీవీపీకి చెందిన రాజేందర్ నాయక్,ఆకాశ్ బాటి,సిద్ధం శుక్లా చింపివేయడం దుర్మార్గపు చర్య అని దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు బానోత్ వినోద్‌కుమార్,ధనియాకుల శ్రీకాంత్‌వర్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోస్టర్లను చింపవద్దని అడిగిన ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఆకాశ్‌ను మద్యం మత్తులో విచక్షణారహితంగా దాడి చేశారని విమర్శించారు.కర్రలు,రాళ్ళతో యూనివర్శిటీ హాస్టల్ కిటికీ అద్దాలు ధ్వంసం చేశారని తెలిపారు. వారికి వారే అద్దాలను పగలగొట్టుకుని గాయాలు చేసుకుని ఎస్ఎఫ్ఐ దాడి చేసిందని ప్రకటించడం సిగ్గుమాలిన చర్య అని పేర్కొన్నారు. కరోనా సమయంలో విద్యార్థులకు హస్టల్స్ ఇవ్వాలని,యూనివర్శిటిలో ఉన్న హస్టల్స్, డిపార్ట్మెంట్ సమస్యలు పరిష్కారం చేయాలని ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడిందని తెలిపారు.ఎన్నికలకు ముందే నిర్వహించిన జనరల్ బాడీ మీటింగ్‌ను కూడా ఏబీవీపీ అడ్డుకుందన్నారు.అదే రోజు ఎస్ఎఫ్ఐ నాయకత్వంపై దాడికి ప్రయత్నం చేశారని విమర్శించారు.మళ్ళీ ఎన్నికల ముందు ఈ చర్యకు పాల్పడ్డారని మండిపడ్డారు.దాడిని ప్రజాస్వామిక వాదులు,మేథావులు ఖండించాలని కోరారు.



గానుగుబండ గ్రామపంచాయతీ సందర్శన

నవతెలంగాణ-తుంగతుర్తి

తుంగతుర్తి మండలపరిధిలోని గానుగుబండ గ్రామపంచాయతీని పంచాయతీరాజ్ శాఖ జాయింట్ డైరెక్టర్ (రూరల్ అర్బన్) నరసింహులు శనివారం సందర్శించారు.పలు రికార్డులను తనిఖీ చేశారు.అనంతరం గ్రామపంచాయతీలో పల్లె ప్రగతిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా పరిశీలించారు.ఈ మేరకు పల్లె ప్రకృతివనం, వైకుంఠదామం,సెగ్రిగేషన్ షెడ్డు,నర్సరీలను స్వయంగా పరిశీలించారు.గ్రామంలో హరితహారం కింద నాటిన మొక్కలను పరిశీలించారు.తడి,పొడి చెత్తను ఏ విధంగా సేకరిస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పల్లె ప్రగతి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీఅధికారి యాదయ్య,మండల పరిషత్ అభివృద్ధి అధికారి భీమ్‌సింగ్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

నేరేడుచర్ల : అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది.ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణానికి చెందిన షేక్ అలీ కార్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నాలుగు రోజులుగా తను కనిపించడం లేదు.మూడు రోజుల నుండి ఆ ప్రాంతంలో భరించలేని దుర్వాసన వస్తుండడంతో ఆ ప్రాంతం ప్రజలు మున్సిపాలిటీ సిబ్బందికి తెలియజేయగా వారు వచ్చి పరిశీలించగా ఉరికి వేలాడుతూ ఉన్న డెడ్‌బాడీ కనిపించడంతో పోలీస్ వారికి సమాచారం అందించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియాస్పత్రికి తరలించారు. పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యర్థాలను జనావాసాల మధ్య పోస్తేచర్యలు

నవతెలంగాణ-మోత్కూరు

చికెన్, మటన్ దుకాణాదారులు మాంసం వ్యర్థాలను రోడ్లపైన, జనావాసాల మధ్య వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సి. శ్రీకాంత్ హెచ్చరించారు. శనివారం మున్సిపల్ కేంద్రంలోని మాంసం విక్రయ దుకాణాలను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాంసం వ్యర్థాలను రోడ్లపైన, చెరువు కట్ట వెంట, బిక్కేరు వాగులో వేయవద్దన్నారు. మాంసం వ్యర్థాలను పట్టణానికి దూరంగా గుంత తీసి పాతి పెట్టాలని దుకాణదారులకు సూచించారు.వీధి కుక్కల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ- ఆలేరుటౌన్



రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యురాలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5 లక్షలతో పట్టణంలోని 9వ వార్డులో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం కౌన్సిలర్ మొర్తల సునీత రమణ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 10 వ వార్డు కౌన్సిలర్ కందుల శ్రీకాంత్ మరియు జూకంటి భాగ్య, కావడి రామచంద్రం, భండ్రు చంద్రయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఇండ్లల్లోనే పత్తి

- ధర పెరుగుతుందని గంపడాశతో ఎదురుచూస్తున్నరైతులు
- 4058 ఎకరాల్లో పత్తి పంట సాగు

నవతెలంగాణ -ఆలేరురూరల్

ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతున్నారు. ఎండనక వాననక నిరంతరం రైతులు శ్రమించి పంటలు పండించి అమ్ముకుందామంటే సరైన ధరలు లేకపోవడంతో నష్టపోతున్నారు. మండలంలో రైతులు పత్తి అధికంగా సాగు చేశారు. చేతికి వచ్చిన పంట అమ్ముదామంటే మద్దతు ధర లేకపోవడంతో రైతులు పత్తిని ఇండ్లల్లోనే నిల్వ చేసుకుంటున్నారు.



ఆలేరు మండలం మెట్ట ప్రాంతం కావడంతో రైతులు వర్షాధారంతో పంటే వాణిజ్య పంట పత్తిని పండించేందుకు మక్కువచూపుతున్నారు. 70 శాతం మంది పత్తి పంటలు వేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ సంవత్సరంలో మండలంలో 4058 ఎకరాల విస్తీర్ణంలో 2100 మంది రైతులు పత్తి పంటను సాగు చేశారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. గతేడాది అధికంగా పత్తి రేట్ ఉండడంతో ఎక్కువ మంది రైతులు పత్తిని సాగు చేశారు. ఈ ఏడాది పత్తి ధర పడిపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా వెళ్లే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనాల కొనుగోలు గుంటుక కిరాయి ,కలుపుతీత,ఎరువులు పురుగుల మందుల కొనుగోలు పత్తి ఏరడం వంటి ఖర్చులు కలిపి మొత్తం 30 నుండి 40వేల మధ్య ఖర్చు వస్తుందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం క్వింటాల్ పత్తికి వస్తున్న మద్దతు ధర రూ.6500 పలుకుతుంది పత్తి ఏరినందుకు కూలీలకు కూడా సరిపోవడం లేదని రైతులు దిగులు చెందుతున్నారు. దళారులకు అమ్ముకుంటే వారు తూకం విషయంలో మోసం చేస్తున్నారు.ఆలేరు మండలం తో పాటు శారాజి పేటలో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తి రేటు పెంచాలని ఆదుకోవాలని కోరుతున్నారు.

పత్తి రైతును ఆదుకోవాలి

బత్తుల నరేందర్ రెడ్డి ,శారాజిపేట రైతు



ఓవైపు అకాల వర్షాలు మరోవైపు పెట్టుబడి ఖర్చులు అధికంగా పెరగడంతో పంట దిగుబడి తగ్గిపోయి రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుల పెట్టుబడి ఖర్చులు ప్రభుత్వ దృష్టిలో ఉంచుకొని క్వింటాల్‌కు రూ.10వేలు ఇవ్వాలి.

పత్తి రైతుకు ఆధారం

సుధాగాని నరసమ్మ,మాజీ సర్పంచ్ శర్బనాపురం



మండలంలోని రైతులు ఎక్కువ పత్తి పంట వేసి దానిమీద జీవనం సాగిస్తున్నారు. పత్తికి మద్దతు ధర లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెరిగిన ధరలకనుగుణంగా పత్తి రేటు పెంచాలి.

పత్తి క్వింటాకు రూ.10వేలు ఇవ్వాలి

పిక్క గణేష్, సీపీఐ(ఎం) మండల కార్యవర్గ సభ్యులు



పత్తి క్వింటాల్‌కుమద్దతు ధర లేకపోవడంతో రైతులు పత్తిని ఏరి ఇండ్లల్లోనే పోసుకుంటున్నారు. ధర పెరుగుతుందని రైతులు ఎదురుచూస్తున్నారు. ధర పెరగకుంటే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది.

సిక్స్ ప్లస్ వన్ వయస్సు కార్పొరేట్ పాఠశాలలకే లాభం

- ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించాలి
- పాఠశాలలో పరిశుద్ధ కార్మికుల నియమించాలి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ -రామన్నపేట

ఒకటవ తరగతిలో చేరబోయే విద్యార్థుల వయస్సు 5 ప్లస్ ఒకటిగానే ఉంచాలని, కేంద్ర ప్రభుత్వం 6 ప్లస్ వన్‌గా ఉత్తర్వులు ఇవ్వడం సరికాదని, వెంటనే ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో సీపీఐ (ఎం) పార్టీ నాయకులు నీల ఐలయ్య కుమార్తె, కుమారుల నూతన పట్టు వస్త్రాల కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిక్స్ ప్లస్ వన్ ఉత్తర్వుల మూలంగా తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఉపయోగమేమీ లేదని, కార్పొరేట్ స్కూళ్లకే ఉపయోగమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించాలని, ఇందుకోసం ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. మన ఊరు- మనబడి మొదటి విడత కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 9123 ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం మే చివరి వరకు అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో 20వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటికి వెంటనే



నోటిఫికేషన్ ఏసి భర్తీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతులపై కోర్టు స్టేను ఎత్తివేయింపజేసి ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను ప్రారంభించాలని కోరారు. మోడల్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కూడా బదిలీలు పదోన్నతులను నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనులను గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్పొరేషన్ కార్మికుల ద్వారా నిర్వహించడం సాధ్యం కావడం లేదని, విద్యాశాఖ నుండే పారిశుధ్య కార్మికులను, సర్వీస్ ఉద్యోగులను నియమించాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్ట్ అధ్యాపకుల రెగ్యులరేషన్ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నట్లుగా ఏప్రిల్ నుండి అమలు అయేవిధంగా ఉత్తర్వులు ఇవ్వాలని ఆయన కోరారు. ఆయన వెంట టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కంచి రవికుమార్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ సిల్వర్ అనిల్ కుమార్, సీనియర్ నాయకులు బాసర యాదగిరి, లలిత తదితరులు ఉన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు ఇవ్వాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహా

నవతెలంగాణ- భువనగిరిరూరల్

ప్రభుత్వం సొంత ఇంటి స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహడిమాండ్ చేశారు.శనివారం సుందరయ్య భవన్‌లో నిర్వహించిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇల్లు లేని పేదలందరికీ ఇండ్లు, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్స్ ,రేషన్ కార్డులు ఇస్తానని ప్రకటించి ఏండ్లు గడుస్తున్నా ఎందుకు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ పథకాలు ఎన్నికల హామీలుగా కాకుండా ప్రజల సంక్షేమానికి ఉపయోగపడాలని సూచించారు. మండలంలో ఇల్లు లేని పేదలు వందలాదిగా ఉన్నారన్నారు. బస్వాపురం రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన రైతులకు, ముంపునకు గురవుతున్న తిమ్మాపురం ఇతర గ్రామాల ప్రజలకు 100శాతం ముంపు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం పరిధిలోని బస్వాపురం ప్రాజెక్టు నుండి వివిధ ప్రాంతాలకు నీళ్లు తీసుకుపోవడానికి తీస్తున్న కాలువల పైన బ్రిడ్జి నిర్మాణాలు చేయకపోవడంతో రైతులు, వృత్తిదారులు, ప్రజలు కాలువలు దాటడానికి ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా కాలువల పైన బ్రిడ్జిల నిర్మాణం



చేపట్టాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కోసం మార్చి 1 నుంచి 30 వరకు గ్రామాన పర్యటనలు చేసి సమస్యలను గుర్తించి పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి మండల కార్యదర్శివర్గ సభ్యులు కొండ అశోక్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శివర్గ సభ్యులు పల్లెర్ల అంజయ్య, మండల కమిటీ సభ్యులు మోటె ఎల్లయ్య, కొండపురం యాదగిరి పాల్గొన్నారు.

విషవాయువులను విడుదల చేస్తున్న హెజులో, ఆప్టిమస్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ -భూదాన్‌పోచంపల్లి

విషవాయువులను విడుదల చేస్తున్న హెజులో, ఆప్టిమస్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు డిమాండ్ చేశారు. మండలంలోని దోతిగూడెంలో ఉన్న హెజ్‌లో, ఆప్టమస్ పరిశ్రమల నుండి వెలువడుతున్న విషవాయుల వల్ల ప్రజలు అనారోగ్యంపాలవుతున్నారని, కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్వాసన వెదజల్లే రసాయన పరిశ్రమలు అనేకంగా పుట్టుకొచ్చాయన్నారు. పరిశ్రమలు వెదజల్లే దుర్వాసన వల్ల ప్రజలు కిడ్నీ ,గుండె సంబంధిత వ్యాధుల బారిన పడి చనిపోతున్నారని పేర్కొన్నారు. భూగర్భ జలాలు కలుషితమై నీటిని తాగిన పాడి పశువుల పాలు కలుషితమవుతున్నాయన్నారు. చిన్న పిల్లల ఎదుగుదల ,గర్భస్రావాలు ఇలా అనేక రకాల సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. సాయంత్రం 6 దాటిందంటే పరిశ్రమల దుర్వాసన విచ్చలవిడిగా రావడం వల్ల శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయన్నారు. పలుమార్లు వినతి పత్రాలు అందజేసినా పీసీసీబీ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా వెంటనే ఆ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. స్థానికుడు సత్యం యాదవ్ మాట్లాడుతూ మూడు నెలల నుండి పరిశ్రమ నుండి విషవాయువులను విడుదల చేస్తూ ప్రజలకు ఇబ్బందికరంగా చేస్తున్నారన్నారు. గతంలోనే అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం మాత్రం శూన్యంగా ఉందన్నారు. మూడు రోజుల నుండి భారీ ఎత్తున ల్యాబ్ నుండి విషవాయువులను వదలడంతో గ్రామస్తులలో శ్వాసకు తీవ్ర ఇబ్బంది జరుగుతుందన్నారు. చిన్నపిల్లలు అకస్మాత్తుగా పడిపోవడం వల్ల అనేక ఇబ్బంది పడుతూ ప్రాణాన్ని గుప్పట్లు పెట్టుకొని గ్రామంలో నివసించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. లేని పక్షంలో మండల వ్యాప్తంగా ప్రజలను సమీకరించి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.



మత్స్యకారులకు సొసైటీ సర్టిఫికెట్ల అందజేత

నవతెలంగాణ -ఆలేరుటౌన్

మండల కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి చేతుల మీదుగా మొరిపిరాల గ్రామ మత్స్యకారులకి సొసైటీ సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సొసైటీ జిల్లా అధికారి రామరాజు ,జిల్లా అధ్యక్షులు కొలుపుల హరినాథ్ ,ఆలేరు పీఏసీఎస్ చైర్మెన్ మొరిగాని మల్లేష్ గౌడ్, బెజ్జనబోయిన మహేష్, బెజ్జనబోయిన బాల మల్లయ్య, ఎద్దు స్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధిలో తెలంగాణ నెంబర్ వన్

నవతెలంగాణ-తుర్కపల్లి



గ్రామాలాభివృద్ధిలో ప్రభుత్వం నెంబర్ వన్ స్థానంలో ఉందని ఎంపీపీ భూక్య సుశీల రవీందర్ నాయక్ , యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ బీకూ నాయక్ అన్నారు. మండలం చిన్న లక్ష్మాపూర్ గ్రామంలో సర్పంచ్ దూబల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీ సంతోష భాస్కర్ రెడ్డి నిధుల నుండి రూ.5 లక్షలు జిల్లా పరిషత్ నుండి రూ.2 లక్షలా 50 వేలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ప్రతి గ్రామంలోనూ సీసీ రోడ్లు అండర్ గ్రౌండ్‌డ్రెయినేజీ వంటి అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి గ్రామపంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్ , వార్డు మెంబర్ కీసరి శేఖర్ బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు మేడిపల్లి రాజు , గోపనబోయిన మల్లేష్ ,చిన్న నాయక్ , బాల్ రెడ్డి , బోల్ల భాస్కర్, మల్లారెడ్డి, మేడిపల్లి కృష్ణ ,మోత్కుపల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టరావిష్కరణ

నవతెలంగాణ-భువనగిరిరూరల్



మండలంలోని నమాత్‌పల్లి గ్రామంలో గల శ్రీ సుదర్శన లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ లక్ష్మీనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్మెన్ ఎనబోయిన ఆంజనేయులు, భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఎడ్ల రాజేందర్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు జనగం పాండు, అనంతారం సర్పంచ్ చిందమ్ మల్లికార్జున్,బబ్బురి రమేష్ పాల్గొన్నారు.

వంద పడకల ఏరియాసుపత్రిగా తీర్చిదిద్దాలి : డీవైఎఫ్ఐ



నవతెలంగాణ-చౌటుప్పల్

పట్టణకేంద్రంలోని 30 పడకల ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఏరియాసుపత్రిగా తీర్చిదిద్దాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశం, ఉపాధ్యక్షులు పల్లె మధుకృష్ణ కోరారు. ఏరియాసుపత్రిగా మార్చాలని డిమాండ్ చేస్తూ మార్చి 6,7 తేదీల్లో పట్టణంలో 48 గంటలు రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్న కరపత్రాలను శనివారం పట్టణకేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో వారు విడుదలచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చౌటుప్పల్ చుట్టుపక్కల నాలుగైదు మండలాలకు కేంద్రంగా ఉన్న రెవెన్యూ డివిజన్ కేంద్రంలో ఉన్న ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యం అందకపోవడంతో ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. ఆసుపత్రిలో కనీస వసతులు కరువయ్యాయన్నారు. పేద ప్రజలు డబ్బులు ఖర్చుపెట్టి ప్రయివేట్ ఆసుపత్రులకు పోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటుచేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్‌చేశారు. 48 గంటల రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షులు సామిడి నాగరాజురెడ్డి, ఎమ్‌డి.ఖాసీమ్, గుండు నర్సింహా, సామిడి జగన్‌రెడ్డి, గుర్రం మల్లారెడ్డి, శంకర్‌రెడ్డి, సుందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసే బీఆర్ఎస్‌లో చేరికలు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

నవతెలంగాణ-మోత్కూరు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసే వివిధ పార్టీలనాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ లో చేరుతున్నారని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మెన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని దత్తప్పగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నారమల్ల యాదయ్య, నారమల్ల రాములు, నారమల్ల ఉప్పలయ్య, నారమల్ల ప్రదీప్ లతో పాటు మరో 10మంది శనివారం ఆయన సమక్షంలో బీఆర్ఎస్ లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అమలు జరుగుతున్న పథకాలు దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు కోరుకుంటున్నారని, సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని దేశ



ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ నాయకత్వమే దేశానికి శ్రీరామరక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి ఎలుగు యాదయ్య, నాయకులు ఎలుగు సోమయ్య, గుండు యాదయ్య, అంజిరెడ్డి, ఎలుగు గంగమల్లు, నేరటి అయిలయ్య, పట్టే స్వామి, రహీమ్ పాషా, వంగూరి నర్సింహ్మ నారమల్ల బుజిలయ్య ముక్కెర్ల అశోక్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గాయత్రి డిగ్రీ కళాశాల విద్యార్థుల విజయదుందుభి



నవతెలంగాణ-చౌటుప్పల్

మహాత్మాగాంధీ యూనివర్శిటీ నల్లగొండ ప్రకటించిన మూడవ, ఐదవ సెమిస్టర్ ఫలితాల్లో చౌటుప్పల్ పట్టణంలోని శ్రీ గాయత్రి డిగ్రీ కళాశాల విద్యార్థులు 10/10 ఎస్‌జీపీఏ సాధించి విజయదుందుభి మోగించారు. బి.కామ్‌లో గొడుగు అఖిల 10/10, ఎంపీసీలో బాలెం నిఖిత 10/10, బీజడ్‌సీలో బొల్ల భవ్యశ్రీ 10/10, బద్రి దివ్య 10/10 ఎస్‌జీపీఏ సాధించారని, 9.88 ఎస్‌జీపీఏలో ఆరుగురు విద్యార్థులు, 9 ఎస్‌జీపీఏలో 40 మందికిపైగా విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కళాశాల చైర్మెన్ బండారు మయూర్‌రెడ్డి, కరస్పాండెంట్ భీమిడి సుభాశ్‌రెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చెన్నగాని అంజనేయులు, అధ్యాపకులు అనంతచారి, హరికృష్ణ, సంతోష, శ్రీను, అనూష, జ్యోతి, సంధ్య, రాజేశ్, రూప పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

- జీపీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు దాసరి పాండు

నవతెలంగాణ -భువనగిరిరూరల్

గ్రామపంచాయతీ కార్మికులకు బకాయిలుగా ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ నిర్వహించే చాలా హైదరాబాదును జయప్రదం చేయాలని గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవా అధ్యక్షులు దాసరి పాండు కోరారు. శనివారం మండలంలోని భువనగిరి మండలంలోని బొల్లెపల్లి, సూరే పల్లి, రెడ్డి నాయక్ తండా, ఆకుతోట బావి తండా, నందనం , నాగిరెడ్డిపల్లి, ఎర్రంబెల్లి, తుక్కాపురం, నమాత్ పెల్లి, అనాజిపురం గ్రామాలు తిరిగి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఐదు నెలలుగా చెల్లించకుండా సిబ్బందితో చాకిరి



చేయించుకుంటున్నాయని తరబడిగా ఏండ్ల తరబడిగా ఆశతో పనిచేస్తున్న ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాలకు సంబంధించిన గ్రామ సిబ్బంది పట్ల ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ నెల 12 నుంచి పాదయాత్ర నిర్వహించి 28 సందర్భంగా ఇంద్ర పార్క్ వద్ద జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోశయ్య నరసింహ మైసయ్య వెంకటేశం అనిత భాగ్య లావణ్యలు పాల్గొన్నారు.

ప్లీనరీకి హాజరైన కుంభం

నవతెలంగాణ -భువనగిరిరూరల్



చత్తీఘడ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ ప్లీనరీకి ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ,రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా ఈ ప్లీనరీ సమావేశం జరుగుతుందన్నారు. ఆయన వెంట పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య , పీసీసీ కమిటీ మెంబర్ తంగేళ్లపల్లి రవికుమార్ ఉన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరీ బాధ్యత

- జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి

నవతెలంగాణ-యాదగిరిగుట్టరూరల్

బాలల హక్కుల పరిరోణ ప్రతి ఒక్కరీ బాధ్యత అని జిల్లా సంక్షేమ అధికారి కేవీ.కృష్ణవేణి అన్నారు. శనివారం మండలంలోని మల్లపురంలో ఎంపీపీఎస్‌లో స్నేహిత రెండో విడత అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు తమ పై జరిగే హింసను ఎదుర్కోవానికి 1098,100 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని వాటి ద్వారా ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు. అదేవిధంగా



జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ బండారు జయశ్రీ మాట్లాడుతూ బాలల స్నేహపూర్వక వాతావరణం అనుకూలంగా ప్రతి ఒక్కరూ. తోడ్పాటును అందించాలని కోరారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి పులుగుజ్జు సైదులు మాట్లాడుతూ పిల్లలకు చెడు, మంచి స్పర్శలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, స్నేహిత టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదివి లక్ష్యాన్ని సాధించాలి

నవతెలంగాణ-చౌటుప్పల్

విద్యార్థులు పట్టుదలతో చదివి తాము ఎన్నుకున్న లక్ష్యాన్ని సాధించాలని శ్రీ గాయత్రి జూనియర్ కళాశాల చైర్మన్ బండారు మయూర్‌రెడ్డి తెలిపారు. శనివారం చౌటుప్పల్ పట్టణంలోని శ్రీ గాయత్రి జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ భీమిడి సుభాశ్‌రెడ్డి



జ్యోతిప్రజ్వలన చేశారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నగాని అంజనేయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అశోక్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ -ఆలేరుటౌన్

మండల కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ,ఆలేరు శాసన సభ్యురాలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వికలాంగుల సంఘం డైరెక్టర్ గుజ్జ అశోక్‌ని శాలువాతో ఘనంగా సన్మానించారు. విజయవాడ వాసవి పరపతి సంఘం ద్వారా నంది అవార్డుకు ఎంపికైన సందర్భంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశం, వార్డు కౌన్సిలర్ బేతి రాములు, మాజీ సర్పంచ్ చింతకింది మురళి, మొరిగాడి వెంకటేష్, పత్తి వెంకటేష్ ,తదితరులు పాల్గొన్నారు.



భారీగా నల్లబెల్లం పట్టివేత

నవతెలంగాణ-నూతనకల్



అక్రమంగా నిల్వ ఉంచిన బెల్లం పట్టికను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ బాలాజీనాయక్ తెలిపారు. శనివారం మండలపరిధిలోని బక్కహేమ్లాతండా ఆవాస ప్రాంతమైన బోటికింది తండాలో గుగులోతు రాములు వ్యవసాయ బావి వద్ద సుమారు 13.50 క్వింటాళ్ల నల్లబెల్లం, 50కిలోల పటికను, 10లీటర్ల నాటుసారా పట్టుకున్నారు.దీనిని పాతలోతు రెడ్యా డంప్ చేశాడు.అతనిపై ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదుచేశారు.సీఐ వెంట ఎస్సై గణేష్, సిబ్బంది ఉన్నారు.

ఠాక్రే పర్యటనను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కోదాడరూరల్

తెలంగాణ ఏఐసీసీ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే మార్చి ఒకటిన కోదాడకు వస్తున్న సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికి పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పట్టణఅధ్యక్షులు వంగవీటి రామారావు కోరారు.శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరు పట్ల ప్రజలు పూర్తి నిరాశలో ఉన్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఇరు పార్టీలు ప్రజలను మోసం చేశాయన్నారు. అధికార పార్టీ నాయకులు అవినీతి, అరాచకాలుకు పాల్పడిన సొమ్ముతో ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావాలని చూస్తున్నాయని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో మండలఅధ్యక్షులు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కందుల కోటేశ్వరరావు, కౌన్సిలర్లు కోటిరెడ్డి, షాబుద్దీన్,గంధం యాదగిరి, కర్రీ సుబ్బారావు, చింతలపాటి శ్రీను, కంపటి శ్రీను, బాగ్దాద్, భాజాన్, పిడతల శ్రీను, ఎస్.దాని, ఖాజాగౌడ్, బాబా, రజనీకాంత్, మోహన్‌రావు, ముస్తఫా, లక్ష్మీనారాయణ, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడదను నివారించాలని వినతి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

పట్టణంలోని అన్ని వీధుల్లో గల వీధికుక్కల బెడదను నివారించేందుకు మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని జన చైతన్య ట్రస్ట్ ఫౌండర్ పినపరాళ్ల వంశీ,అధ్యక్షుడు పారాసాయి ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ అన్ని వీధుల్లో కుక్కలు ఎక్కువ కావడంతో బాటసారులతో యా ప్రదేశాలలో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు,తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా శ్రీ చైతన్య కృష్ణవేణి, గ్రీన్‌వుడ్, ప్రియదర్శిని తదితర పాఠశాల కళాశాలకు వెళ్లే దారిలో ఈ వీధికుక్కలు ఎక్కువగా ఉన్నాయన్నారు.వినతిపత్రం అందజేసిన వారిలో పిల్లి శివకుమార్, వెంకి, రమేశ్ ఉన్నారు.

సూర్యాపేట: పట్టణంలో కుక్కల బెడదను నివారించాలని ప్రజా పంథా పట్టణ కార్యదర్శి గులాం హుస్సేన్ డిమాండ్ చేశారు.సీపీఐఎంఎల్ ప్రజా పంథా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.వినతిపత్రం అందజేసిన పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎర్ర అఖిల్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రామోజీ, వాజిద్,నగేష్ ఎల్లయ్య, సైదులు తదితరులు ఉన్నారు.

కులవృత్తిదారులకు ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ

నవతెలంగాణ-మిర్యాలగూడ

ఈనెల 23న మిర్యాలగూడ పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంపు దళిత బంధు యూనిట్ల పంపిణీ కార్యక్రమంలో కుల వృత్తిదారులపై ఎమ్మెల్యే భాస్కర్‌రావు చేసిన వ్యాఖ్యలకు ఆయన శనివారం బహిరంగ క్షమాపణ చెప్పారు. కుల వృత్తిదారులకు కించపరిచే విధంగా తాను మాట్లాడలేదని, ఎవరికైనా మనోభావాలు దెబ్బ తిన్నట్లయితే క్షమించాలంటూ ఒక వీడియోను రిలీజ్ చేశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో పెట్టడం వల్ల సామాజిక మాధ్య మాల్లో అది చక్కర్లు కొడుతుంది. దళిత బంధు యూనిట్ల పంపిణీ కార్యక్ర మంలో వేదికపైకి ప్రజా ప్రతినిధులను, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఆహ్వానించే క్రమంలో కొందరి ఎంపీపీ, జెడ్పీటీసీ పేర్లు తెలియకపోవడంతో ఎంపీపీలు, జెడ్పీటీసీలు వేదికపైకి రావాలని ఆహ్వానించారన్నారు. ఆ సమయంలో మిర్యాలగూడ ఎంపీపీ నూకల సరళ ప్రోటోకాల్ పాటించలేదని ప్రశ్నించడంతో ఓ అగ్రకుల ప్రజాప్రతినిదీని మందలించే క్రమంలో చాకలి, మంగలి పనులు నేనే చేయాలా అంటూ ఉచ్చరించానే తప్ప బలహీన వర్గాలను కించపరచాలని ఉద్దేశంతో కాదని చెప్పారు. తాను రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలవడంలో బలహీన వర్గాల పాత్ర కీలకంగా ఉందని, ఏనాడు కులవృత్తులను కించపరచలేదని, భవిష్యత్తులో అలా జరగదని చెప్పారు. ఎవరికైనా మనసు నొప్పినట్లయితే క్షమించాలని కోరారు.

గిరిజనసంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-పెద్దవూర

మార్చి 1, 2 ,3 ,తేదీలలో జరిగే తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల ఉపాధ్యక్షులు రమావత్ సీతారాంనాయక్ పిలుపునిచ్చారు. శనివారం మండలం నాయనవారికుంట తండాలో తెలంగాణ గిరిజన సంఘం గోడ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. గిరిజన సంఘం మూడవ మహాసభలు నల్లగొండ జిల్లా మిర్యాలగూడెంలో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం నాయకులు శ్రీకాంత్ శర్మన్ గోలియా, వినోద్, బాలు, రవి, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో మర్రిగూడ విద్యార్థిని మృతి

నవతెలంగాణ-మర్రిగూడ



హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో మర్రిగూడకు చెందిన బీటెక్ విద్యార్థిని శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం..నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం లెంకలపల్లి గ్రామానికి చెందిన మానే సంకీర్తన(19) హైదరాబాదులోని చైతన్యపురి హాస్టల్లో ఉంటూ బండ్లగూడలోని శ్రేయాస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతుంది. శుక్రవారం రాత్రి హాస్టల్ నుండి వనస్థలిపురం రాపిడో బైక్ పై తన చిన్నమ్మ ఇంటికి వెళుతుండగా పనామా చౌరస్తా సర్కిల్ సమీపంలో ప్రమాదవశాత్తు బైక్ పై నుండి జారి పడడంతో వెనుక నుండి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. సంకీర్తన తండ్రి మానే శోభన్ బాబు నల్లగొండ జిల్లా సీనియర్ జర్నలిస్ట్, స్టార్ నైన్ కరస్పాండెంట్‌గా పనిచేస్తున్నారు.

సంకీర్తనకి పలువురు నివాళి

హైదరాబాద్ వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన బీటెక్ విద్యార్థి నల్లగొండ జిల్లా సీనియర్ జర్నలిస్ట్, స్టార్ నైన్ జిల్లా కరస్పాండెంట్ మానె శోభన్ బాబు కుమార్తె మానె సంకీర్తన(19) మృత దేహానికి శనివారం పలువురు నాయకులు వారి స్వగ్రామమైన మర్రిగూడ మండలం లెంకలపల్లి గ్రామానికి వెళ్లి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పిల్లి రామరాజు యాదవ్, సీపీఐ మండల కార్యదర్శి ఈదుల బిక్షంరెడ్డి, మండల, జిల్లా నాయకులు, ఫ్లోరోసిస్ విముక్తి సమితి రాష్ట్ర కన్వీనర్ కంచకట్ల సుభాష్, జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామ కల్యాణలక్ష్మీ పథకానికి రూ.5,016 పంపిణీ

నవతెలంగాణ-పెద్దవూర

మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్, రిటైర్డు ఎంఈఓ గ్రామ సర్పంచ్ నరాల కొండయ్య సర్పంచ్‌గా గెలిచినప్పటి నుంచి నేటివరకు గ్రామంలో ఏ ఆడపడుచు వివాహం చేసుకున్న ఆ వదువుకు రూ.5,016 గ్రామ కల్యాణ లక్ష్మీ కింద సొంతంగా కానుక అంద జేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ గ్రామానికి చెందిన ఆడపడుచుకు ఎక్కడ వివాహం అయినా అక్కడికి వెళ్లి కల్యాణ లక్ష్మీ కింద అందజేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. వారికి ప్రైజ్ మని అందజేస్తూ మండల సర్పంచులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. తాను సర్పంచ్ అయినప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 80 మంది అడపడచుల వివాహాలకు 5,016 అందజేశారు. అందులో భాగంగా శనివారం గ్రామానికి చెందిన పుట్టపాక లింగయ్య లింగమ్మ కుమార్తె ప్రవలికకు నడికుడ గ్రామంలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కూరాకుల అంతయ్య, గ్రామ ఉపసర్పంచ్ తుడుం అంజయ్య, గ్రామ వార్డు సభ్యులు గొన మోహనరావు, పగడాల నాగమ్మ వెంకన్న, రేబెల్లి రమణయ్య, రేబెల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రీతిని వేధించిన వారిని కఠినంగా శిక్షించాలి'

నవతెలంగాణ-నాగార్జునసాగర్

పీజీ విద్యార్థిని డాక్టర్ ధరావత్ ప్రీతిని వేధించి ఆమె ఆత్మ హత్యాయత్నానికి కారకుడైన సీనియర్ పీజీ విద్యార్థి డాక్టర్ సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం సాగర్ పట్టణ అధ్యక్షుడు రమావత్ మోహన్‌నాయక్ అన్నారు. శనివారం ఆయన స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, ఏఐబీఎస్ రాష్ట్ర కమిటీ తరఫున ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ రమేష్ జి, ఏఐబీఎస్ జిల్లా ఉపా ధ్యక్షులు చంద్రమౌళినాయక్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు మంగ్తా నాయక్, కిరణ్‌నాయక్, శివానాయక్, మధు, నాగార్జున, శరాబంధు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబపాలనకు చరమగీతం పాడాలి

నవతెలంగాణ-చింతపల్లి

రాష్ట్రంలో కుటుంబ పరిపాలనకు చరమగీతం పాడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం చింతపల్లి మండలంలోని కుర్మేడు 13,14,15,16, బూత్‌లలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి గాదరి జంగయ్య అధ్యక్షతన ఆయన ఆధ్వర్యంలో జరిగిన ప్రజగోసా బీజేపీ భరోసా కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చింతపల్లి మండల పార్టీ అధ్యక్షుడు శివర్ల రమేష్, బూత్ అధ్యక్షులు, కుర్మేటి వెంకటరమణ, కుర్మేటి శ్రీను కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరుల పాల్గొన్నారు.

జేబీఎస్ పాఠశాలలో కుక్కల నివారణపై అవగాహన

నవతెలంగాణ-నల్లగొండకలెక్టరేట్

నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో కుక్కల నివారణపై శనివారం నల్లగొండ పట్టణంలోని జేబీఎస్ పాఠశాలలో మున్సిపల్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీ. రాములు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కలిగించారు. అనంతరం పట్టణంలోని 35 వ వార్డు పద్మా నగర్‌లో కాలనీవాసులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఈఈ రాములు మాట్లాడుతూ కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలని, స్కూల్ విద్యార్థులు ఒంటరిగా వెళ్లకుండా గుంపులుగా వెళ్లాలని తెలిపారు. కాలనీవాసులు, మటన్, చికెన్ షాపు యజమానులు మిగిలిన ఆహార పదార్థాలను, వ్యర్థాలను వీధులలో పడవేయరాదని, కుక్కలు గుంపుగా కనబడితే మున్సిపల్ శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 14420, లేదా 08682- 220100 కు కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ శ్రీనివాస్, సీఓ జ్యోతి, ఆర్‌పీ ప్రమీల, మహిళ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ యువజన సంఘం అధ్యక్షులుగా విజయ్

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నందికొండ మున్సిపాలిటీ బీసీ యువజన సంఘం అధ్యక్షులుగా కోడ విజయ్ గంగపుత్రను నియమిస్తున్నట్లు బీసీ యువజన సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రేపాకుల ఆంజనేయులు యాదవ్ తెలియజేశారు. శనివారం ఈ మేరకు బీసీ భవన్‌లో నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ యువజన సమస్యలపై, నిరుద్యోగ సమస్యపై పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నందికొండ మున్సిపాలిటీ అధ్యక్షులు మంజల రామదాసు, జిల్లా సీనియర్ నాయకులు చెంగలి జంగయ్య, విద్యార్థి సంఘం నియోజకవర్గ అధ్యక్షులు జోగు రమేష్ ముదిరాజ్, దెందులూరి సాయి తేజ, కోడ శ్రీను, రాజు, కోదండం మోహన్, తరుణ్ కుమార్, రవి, పృధ్వి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

నవతెలంగాణ-నిడమనూరు

విద్యుత్ ఉద్యోగుల పీఆర్సీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నిడమనూర్ మండల కేంద్రంలో విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు భోజన విరామ సమయంలో శాంతియుత వాతవారణంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం పలువురు జేఏసీ నాయకులు మాట్లాడుతూ...విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగులకు పీఆర్సీ గడువు ముగిసి 11 నెలలు గడిచిన విద్యుత్ సంస్థల మేనేజ్మెంట్ పీఆర్సీ ప్రకటించలేదని, ఉద్యోగులు ఆ భద్రత భావాలకు గురౌతున్నారని, వెంటానే సీఆర్సీని ప్రకటించాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సబ్ ఇంజినీర్ జానయ్య, నిడమనూర్ టౌన్ ఏఎల్ఎం సోమశేఖర్, ఏల్డిసి సురేష్, హరికృష్ణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మినీ ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభించిన ఎంపీపీ

నాంపల్లి :మండలంలో తుంగపాటి గౌరారం పరిధిలోని శ్రీ చలిదోన లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం వద్ద నూతనంగా నిర్మించిన మినీ పంక్షన్ హల్‌ను శనివారం నాంపల్లి ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేత రవీందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి జెడ్పీటీసీ ఏవీ.రెడ్డి, మండల రైతు బంధు సమితి కన్వీనర్ ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి, దేవాలయ కమిటీ చైర్మెన్ మేకల దేవేందర్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గుమ్మడపు నరసింహరావు, మాల్ మార్కెట్ డైరెక్ట్ కడారి శ్రీశైలం యాదవ్, సర్పంచ్‌లు మునగాల సుధాకర్‌రెడ్డి, దండిగా నర్సింహా, ఉప సర్పంచ్ పచ్చిపాల ఆంజనేయులు, నక్క శేఖర్, వార్డు సభ్యులు నీల నర్సింహా, నేతల్ల యాదగిరి, నేతళ్ళ నర్సింహా, దండిగా నరేష్, కొమ్ము నర్సింహా, కోటేష్, పచ్చిపాల నరేష్, నరేష్, బట్టు రాము, నల్ల యాదయ్య, నేతళ్ళ లింగయ్య, కసిరెడ్డి మహేష్, నేతల్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీబంధు పథకం అమలు చేయాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ

తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు బీసీ బందు పథకం అమలు చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం దగ్గర నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బీసీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను అడుగడుగునా అణచివేతకు గురి చేస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన దళిత బంధుతో పాటు బీసీలకు కూడా బీసీ బందు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం మిర్యాలగూడ నియోజకవర్గం అధ్యక్షులు పోలిశెట్టి అజయ్, వేములపల్లి బీసీ యువజన సంఘం మండల అధ్యక్షులు చిలకమర్రి ఇంద్రాచారి, బీసీ యువజన సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రాంబాబు, నాయి బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షులు నరసింహ, జానపాటి రవి, గంగాధర్, రుషి, సంతోష్, కార్తీక్, మణి, నవీన్, అబాస్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ప్రజా సంక్షేమ నికి బీజేపీప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో తగిన ప్రాధాన్యత కల్పిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం స్టేట్ బ్యాంక్ ఆవరణలో బీజేపీ ప్రజాగోష శక్తి కేంద్ర కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్రౌపది ముర్మును రాష్ట్రపతి చేసిన ఘనత బీజేపీకి దక్కుతుందన్నారు. సామాజిక న్యాయం , సమాజం కోసం ఐదు సంవత్సరాల లో ఏడుసార్లు జైలుకు వెళ్లిన చరిత్ర తనదనన్నారు. భరోసా శక్తి కేంద్ర కార్నర్ సమావేశం శక్తీ కేంద్ర ఇన్‌చార్జి కటికం బాలరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యాక్షులు కాసం వెంకటేశ్వర్లు , జిల్లా అధ్యక్షులు పి.వి శ్యామ్ సుందర్ రావు , జిల్లా ఇన్‌చార్జి నందకూమర్ యాదవ్, రాష్ట్ర నాయకులు సుదగాని హరిశంకర్ గౌడ్, మాజీ మంత్రి విజయరామ రావు , తదితరలు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కెసిఆర్

నవతెలంగాణ- ఆలేరు రూరల్

ఎన్నికల ముందు తెలంగాణ రాష్ట్రానికి ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ హామీలను విస్మరించారని బీజేపీ రాష్ట్ర నాయకులు సుదగాని హరి శంకర్ గౌడ్ అన్నారు. శనివారం ఆలేరు మండలంలోని గొలనుకొండ, కొల్లూరు గ్రామాలలో ప్రజా గోస బీజేపీ భరోసా శక్తి కేంద్ర కార్నర్ సమావేశంలో వారు పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడారు .ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సుద గాని రాజు, మండల అధ్యక్షులు దూసరి రాఘవేంద్ర, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు యాదగిరి, శేఖర్ ,భాస్కర్ రెడ్డి ,చారి, శేఖర్ ,శ్రీకాంత్, నవీన్ ,వీరస్వామి, శ్రీనివాస్, శంకర్ ,సాయిప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతంలో భాగస్వాములు కావాలి

నవతెలంగాణ-మోత్కూరు

సహకార సంఘాల బలోపేతంలో రైతులంతా భాగస్వాములు కావాలని మోత్కూరు సింగిల్ విండో చైర్మెన్ కంచర్ల అశోక్ రెడ్డి అన్నారు. మోత్కూరు రైతు సేవా సహకార సంఘం పాలకవర్గం స్టడీ టూర్‌లో భాగంగా శనివారం ముల్కనూరు సహకార సంఘాన్ని సందర్శించి సొసైటీ కార్యకలాపాలను పరిశీలించారు. ముల్కనూరు సహకార సంఘంలో నిర్వహిస్తున్న విత్తనశుద్ధి కర్మాగారం, ఎరువుల గోదాం, పత్తి మిల్లు, రైస్ మిల్లులను, పిల్లల చదువుల కోసం రైతులకు ఇచ్చే విద్యా రుణాలు, గృహ, వైద్య రుణాలపై ముల్కనూరు సొసైటీ చైర్మన్ ఎ. ప్రవీణ్ రెడ్డి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో సింగిలిండో వైస్ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు జిట్ట లక్ష్మయ్య, పురుగుల మల్లయ్య, బయ్యని చంద్రశేఖర్, సామ పద్మారెడ్డి, కారుపోతుల ముత్యాలు, దేవసరి రాములు, తాళ్లపల్లి స్వామి, బండ పద్మ, బుశిపాక సుజాత, సంఘం సీఈవో కొణతం వరలక్ష్మీ, సిబ్బంది షేక్ యాకూబ్, సుంకరబోయిన సందీప్ పాల్గొన్నారు.

దేవస్థాన చైర్మెన్‌గా ఉప్పలయ్య

నవతెలంగాణ -వలిగొండరూరల్

మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో గల శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన చైర్మెన్‌గా గ్రామానికి చెందిన నానమాల ఉప్పలయ్య ఏకగ్రీవంగా రెండోసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం దేవాలయ ఆవరణలో పదవి స్వీకరణ కార్యక్రమాన్ని ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సుమతి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం చైర్మెన్ మాట్లాడుతూ తన పై నమ్మకం ఉంచి రెండోసారి చైర్మన్ గా ఎన్నిక చేసిన స్థానిక శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పసల అన్నా మేరీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎమ్మే లింగస్వామి, అయిటిపాముల ప్రభాకర్, ఎడవెల్లి యాదయ్య, పసల శౌరి, బొమ్మ నరసింహ, సీత శంకర్, కొండ లక్ష్మయ్య, చిట్టోజు వెంకట్ నారాయణ చారి, కొడితల విజయ్, కుచిమల్ల సుధాకర్, కడవేరు వీరస్వామి, కడవేరు యాదగిరి, బూడిద స్వామి పాల్గొన్నారు.

దాడులతో ఎస్ఎఫ్ఐ ఉద్యమాన్ని అడ్డుకోలేరు

నవతెలంగాణ -రామన్నపేట

దాడులతో ఎస్ఎఫ్ఐ ఉద్యమాన్ని ఎట్టి పరిస్థితులలో అడ్డుకోలేరని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బుర్రు అనిల్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ నాయకులపై ఏబీవీపీ దాడిని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐకి ఉన్నఆదరణను చూసి ఓర్వలేక ఎన్నికల ప్రచారానికి వెసిన పోస్టర్లను ఏబీవీపీకి చెందిన రాజేందర్, ఆకాశ్ బాటీ చింపివేశారని ఆయన అన్నారు. ఎందుకు చింపుతున్నారని ప్రశ్నించిన ఎస్ఎఫ్ఐ నాయకుడు ఆకాశ్ పై కర్రలు, రాళ్ళతో విచక్షణారహితంగా దాడి చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. ఎస్ఎఫ్ఐని దాడులతో, హత్యలతో అడ్డుకోలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివ కుమార్, ఎస్.ఎఫ్.ఐ మండల అధ్యక్షుడు మేకల జలెందర్, మండల నాయకుడు కంబాలపల్లి సాయి చరణ్, పుట్టలఉదయ్, గంటెపాక శ్రీను, తుర్కపల్లి నరేష్, నమృత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ చెక్కు అందజేత

నవతెలంగాణ -భువనగిరిరూరల్

భువనగిరి మండలంలోని బస్వాపురం గ్రామానికి చెందిన పిన్నింటి మల్లా రెడ్డి కి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.56వేల చెక్కును శనివారం ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో భువనగిరి ఎంపీపీ నరాల నిర్మల-వెంకటస్వామి యాదవ్ , టిఆర్ఎస్ జిల్లా నాయకులు వెంకటస్వామి యాదవ్ పాల్గొన్నారు.

రైతుకుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ- భువనగిరిరూరల్

మండలంలోని నమాత్ పల్లి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం జిట్టా వెంకటరెడ్డి ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందాడు. మృతుని కుటుంబానికి శనివారం విజయ డెయిరీ వలిగొండ మేనేజర్ కుషాల్ రెడ్డి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎల్లంల వెంకటేశం, విజయ డైరీ రైతులు జిట్ట చిన్న రాజిరెడ్డి, గొర్ల జంగయ్య, బత్తిని దశరథ, మేకల నరేష్, తేల్జూరి మల్లేశం, నాగు శ్రీకాంత్, ఎల్లంల రమేష్, పబ్బతి బాల నరసింహ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్

నవతెలంగాణ -భువనగిరి రూరల్



వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో ఎన్‌పిఆర్‌డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమ న్నారు. సమాజంలో వికలాంగులు కూడా ఏమీ తక్కువ కాదు వారిని యువత ఆదర్శంగా తీసుకుని రక్తదాన శిబిరాలు నిర్వహించి ఆపదలో ఉన్న నిండు ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. డొనేట్ బ్లడ్ సేవ్ లైఫ్ అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకొని ముందుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సురుపంగ ప్రకాష్, వనం ఉపేందర్, గౌరవ అధ్యక్షులు మాటూరి బాలరాజు, కోశాధికారి బొల్లేపల్లి స్వామి, జిల్లా మహిళా కన్వీనర్ కొత్త లలిత, జిల్లా ఉపాధ్యక్షులు పాక వెంకటేష్ యాదవ్, జి లింగస్వామి, నాగు నరసింహ , ఎ విజయ్ కుమార్, ఎ వెంకటేశం, మైలారం రమేష్ , బరిగల నవీన్, బొమ్మ నరేష్, భూక్య వెంకటేష్ పాల్గొన్నారు.

న్యాయసాధికారత అంశంపై చైతన్య సదస్సు

నవతెలంగాణ -యాదగిరిగుట్ట/భువనగిరిరూరల్



యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా యంత్రాంగం వారి సంయుక్త ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా ,వాణిజ్య లైంగిక వ్యాపారం సంబంధిత చట్టాలు, బాదితుల న్యాయ సాధికారతా అంశంపై న్యాయ చైతన్య , లీగల్ సర్వీసెస్ మాడ్యూల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రానికి ముఖ్యఅతిథిగా మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె,మారుతి దేవి హాజరై మాట్లాడుతూ నేటి సమాజంలో విద్య, విజ్ఞానంతో ముందుకు వెళుతూ ప్రపంచ శిఖరాన నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. సమాజం లైంగిక వేధింపులు, వ్యాపారం దాని కోసం వ్యాపారం చేస్తూ, మానవత్వ విలువల సమాజం ఎక్కడికెళ్తుందో ప్రశ్నించుకోవాలనారు. సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. దశరథ రామయ్య మాట్లాడుతూ అక్రమ రవాణా మరియు లైంగిక వ్యాపారం చేసే వారి అకృత్యాలను చట్టం చూస్తూ ఊరుకోదని దానికి కఠిన శిక్షలు నేరగాళ్లకు తప్పవని, బాధితులకు చేయుత, భరోసా కల్పించటానికి ఈరోజు అన్ని శాఖలతో, ఆయా శాఖల ద్వారా చేయుత సహాయం అందివ్వటానికి స్వయంగా బాధితుల సహాయ శిబీరాలను ఏర్పాటు చేయటమైనదని, న్యాయ సేవా సంస్థ ద్వారా సత్వర న్యాయం, సలహా పొందవచ్చని తెలిపారు.ఆలేరు జూనియర్ సివిల్ జడ్జి, ఆలేరు న్యాయ సేవ సమితి అధ్యక్షులు ఎస్ సుమలత మాట్లాడుతూ సంబంధిత చట్టాలు, నేరాలు వాటిపై వివరించారు. కార్మిక శాఖ, ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేసి, బాధితులకు సంస్థ ద్వారా సహాయం పొందడాని వివరించారు. ఈ కార్యాక్రమములో సి డబ్ల్యూ సి అధ్యక్షులు జయశ్రీ, జిల్లా సంక్షేమ అధికారిని కృష్ణవేణి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారిని శ్రీలక్ష్మి, పట్టణ పేదరిక నిర్మూళనా శాఖ అధికారి రమేష్ కుమార్, యాదగిరిగుట్ట మునిసిపల్ కమీషనర్ శ్రవణ్ కుమార్ రెడ్డి, స్కీడ్ ఎన్జిఒ సంస్థ నాగరాజు, యాదగిరిగుట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ సైదయ్య, డిసిపిఒ సైదులు, భువనగిరి, ఆలేరు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు బి. కేశవ రెడ్డి, శ్రీహరి, జిల్లా ప్రభుత్వ న్యాయవాది ఎన్. అంజయ్య, న్యాయ సహాయ న్యాయవాది శంకర్, యాదగిరిగుట్ట కౌన్సిలర్ మౌనిక శ్రీధర్ పాల్గొన్నారు.



ఐక్య ఉద్యమాల ద్వారానే సాగు,తాగు నీరు సాధ్యం

- సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు

నవతెలంగాణ -ఆలేరుటౌన్/ఆలేరురూరల్

ఐక్య ఉద్యమాల ద్వారానే సాగు, తాగునీటిని ఆలేరు నియోజకవర్గం వ్యాప్తంగా సాధించవచ్చని సీపీఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో పార్టీ సభ్యులు, ప్రజాసంఘాల విస్తృత జనరల్ బాడీ సమావేశం చౌడబోయిన కనకయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాగు, తాగు నీరు, సాధించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బస్వాపురం, గంధమల్ల రిజర్వాయర్, బునాదిగాని కాలువ, పిల్లాయికాలువల నిర్మాణ పనులను పూర్తిచేయడంలో సాధించడంలో విఫలమయ్యాయని పేర్కొన్నారు. ఈనెల 28న ఉపవాస దీక్ష నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాలలో ప్రభుత్వ భూములు అర్హులైన పేదలకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చౌడబోయిన పరుశు రాములు, ఎ ఐ టి సి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఎల్లంకి మహేష్, సివిల్ సప్లై జిల్లా అధ్యక్షులు శ్రీను, పట్టణ కార్యదర్శి గొట్టి పాముల రాజు, కొలనుపాక గ్రామ శాఖ కార్యదర్శి పొన్నబోయిన రవి, బొడ్డు ఆంజనేయులు, రాచకొండ రాజారెడ్డి, జంగ సరళ, తదితరులు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ- ఆలేరురూరల్

ఆలేరు పట్టణ ,పరిసర ప్రాంత విద్యార్థులకు గురుకుల పాఠశాలలో ఐదవ తరగతిలో ప్రవేశం కోసం ఎంట్రన్స్ టెస్ట్ కు ఆలేరులో కోచింగ్ ఇస్తున్నట్టు కోచింగ్ నిర్వాహకులు కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నెలలుగా కోచింగ్ సెంటర్ లో 180 మంది కోచింగ్ తీసుకుని 161 మందికి పైగా సీట్లు సాధించి వాళ్ళ భవిష్యత్ తీర్చిదిద్దడానికి కృషి చేశామనితెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మార్చి 6తేదీ వరకు అడ్మిషన్లు తీసుకుంటున్నామని తెలిపారు.



బస్టాండ్‌ను యథావిధిగా కొనసాగించాలని కరపత్రాలు విడుదల

- 28న పట్టణ బంద్‌కు పిలుపు

నవతెలంగాణ -యాదగిరిగుట్ట

పట్టణంలోని బస్టాండ్ యథావిధిగా కొనసాగించాలని కోరుతూ శనివారం అన్ని రాజకీయ పార్టీల ప్రజాసంఘాల ఐక్యకారచరణ కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదుట కరపత్రాలను విడుదల చేశారు. ఈనెల 28న పట్టణ స్వచ్ఛంద బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 50 ఏండ్ల క్రితం పట్టణ ప్రజల ప్రయాణ సౌకర్యం, భక్తుల సౌకర్యార్థకం, పట్టణ అభివృద్ధి కోసం అన్ని విధాలుగా ఆలోచించి బస్టాండ్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. బస్టాండ్ ఆధారంగా వేలాది కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయన్నారు. పట్టణంలోని 12 వార్డుల ప్రజలకు ఈ బస్టాండ్ సౌకర్యంగా ఉందని ప్రభుత్వం తరలించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళ్లెం కృష్ణ, కాటబత్తిని ఆంజనేయులు, మంద శంకర్, రచ్చ శ్రీనివాస్,బందరపు బిక్షపతి, బబ్బురి పోశెట్టి,మిట్ట నర్సింగ్, పేరబోయిన పెంటయ్య, బోవనగిరి శ్యామ్, గుండ్లపల్లీ శ్రీరామ్, బబ్బురి శ్రీధర్, బొజ్జ సాంబేష్,బెలిద అశోక్, పేరబోయిన మహేందర్, బండి అనిల్, గుండు నరసింహ,సుదగాని గోపాల్, బట్టు సతీష్ రాజ్, గొప్పగాని రాజు, కోమ్మగాని రాము,కొన్నె సంజీవ, రాయగిరి ఉమాపతి, గడ్డమీది లక్ష్మీనారాయణ, అనంతుల నరసింహ, శేఖర్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

టీఎంకే ఫామ్ లాండ్ ప్రారంభం

నవతెలంగాణ- ఆలేరురూరల్

మండలోనిశర్బనాపురం గ్రామంలో రెండు ఎకరాల భూమిలో టీఎంకే సంస్థ ఆధ్వర్యంలో ఎండి సురేష్ కుమార్ ,మహేష్ కుమార్ పామ్ లాండ్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పంజాల శ్రావణ్, జై హిందు, శ్రీనివాస్ రావు, వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ సత్త రాజయ్య, ఉప సర్పంచ్ గడ్డమీద నరేష్ ,నాయకులు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్ద మునిగల్‌లో న్యాయ సేవా సదస్సు

నవతెలంగాణ-దేవరకొండ

నల్లగొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థల, మండల న్యాయ సేవాధికారి సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నేరేడు గుమ్మ మండలం పెద్ద మునిగల్ గ్రామంలో లీగల్ సర్వీసెస్ క్యాంపు నిర్వహించనున్నట్లు దేవరకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. రమా శంకర్ తెలిపారు. శనివారం స్థానిక మున్సిప కోర్టులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్ద మునిగల్ గ్రామములోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. లీగల్ సర్వీసెస్ క్యాంపులో రాష్ట్ర న్యాయాధికార సేవా సంస్థ చైర్మెన్, హైకోర్టు జడ్జి పి.నవీన్‌రావు, హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి కే. లక్ష్మణ్, జిల్లా న్యాయమూర్తి బీఎస్. జగ్జీవన్ కుమార్, జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎస్పీ అపూర్వరావు , జిల్లా న్యాయమూర్తులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కే.సురేష్ కుమార్ పాల్గొన్నారు.



తల్లిదండ్రుల సమావేశం

నవతెలంగాణ-చిట్యాలటౌన్

చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్‌ఎం మాధవి ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మెన్ పోలేపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రస్తుతం మౌలిక వసతులకు సంబంధించి ఎలాంటి సమస్యలు లేవని తల్లిదండ్రులకు తెలిపారు. విద్యా భోధన విషయమై కొంత ఇబ్బంది ఉందని, దీనిని విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.



బీసీలకు మూడు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలి

కేసీఆర్ లేఖలు జాజుల లింగంగౌడ్

నవతెలంగాణ-మిర్యాలగూడ

త్వరలో భర్తీ కానున్న ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు మూడు స్థానాల్లో బీసీలకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. శనివారం ఉత్తరాలు పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి మొదటి నుంచి బీసీలు అండగా ఉన్నారని, జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు అదే స్థాయిలో గౌరవ ప్రదమైన పదవులు ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు లేకపోవడం వల్ల రాజకీయంగా ఎదగలేకపోతున్నారు. మంత్రి పదవులు కూడా బీసీలకు కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, జానపాటి రవి, చేగొండి మురళి యాదవ్, అంజి యాదవ్, వెంకటేశ్వర్లు, వంశీ తదితరులు పాల్గొన్నారు.



స్ఫూర్తి విద్యాలయంలో స్వపరిపాలన దినోత్సవం

నవతెలంగాణ-నార్కట్ పల్లి

మండల పరిధిలోగలనెమ్మాని గ్రామంలోని స్ఫూర్తి విద్యాలయంలో స్వపరిపాలన దినోత్సవం శనివారం విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించి ఉపాధ్యాయులతో విద్యార్థులు ప్రశంసలు అందుకున్నారు. కలెక్టర్‌గా గౌతం డిప్యూటీ కలెక్టర్‌గా ఉపాస్య ఎండిఓగా వైభవ్ డీఈవోగా నాగచైతన్య ఎమ్మార్వోగా శివమణి ఆర్డీవోగా సుశాంత్ ఎంఈఓ యశ్వంత్ ఎంపీపీగా రోహిత్ , ప్రధానోపాధ్యాయులుగా కే సాత్విక్ పాఠశాల చైర్మెనుగా రోహిత్ డైరెక్టర్ గా మత్స్యగిరి వ్యవహరించారు పలువురు విద్యార్థులు విద్యా బోధన చేశారు . ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సాగి శైలేంద్ర కుమార్ ప్రధానోపాధ్యాయులు వంగాల శ్రీనివాసరెడ్డి డైరెక్టర్లు వెంకట్ రెడ్డి, శ్యామ్ నరసింహ మల్లేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయాలని వినతి

నవతెలంగాణ-మునుగోడు

ప్రజలకు పచ్చని పంటలకు హాని కలిగించే ఫార్మ కంపెనీలను పల్లెల్లో ఏర్పాటు చేసుకునేందుకు టీఎస్ పాస్ ద్వారా ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని కోరుతూ శనివారం ఫార్మా కంపెనీ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో మునుగోడు మండల ప్రజా ప్రతినిధులు, అఖిలపక్ష రాజకీయ నాయకులతో కలిసి నల్లగొండ జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మునుగోడు మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిర్మిస్తున్న సన్ లైట్ ఆక్టివ్ ఫార్మా కంపెనీ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మునుగోడు మండలంలో ఫార్మా కంపెనీని ఏర్పాటు చేసినట్లయితే గాలి, నీరు కలుషితమై ఈ ప్రాంత ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవడంతో పాటు మానవ మనుగడకు ప్రమాదం పొంచి ఉన్నదని పేర్కొన్నారు. ఈ



కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక కమిటీ సభ్యులు ఎంపీపీ కర్నాటి స్వామి యాదవ్, సర్పంచులు మిర్యాల వెంకన్న, పగ్గిళ్ల బిక్షం, కిష్టాపురం ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, బొడ్డు నాగరాజుగౌడ్, పోలగోని సైదులు, జాజుల సత్యనారాయణ, పంతంగి స్వామి, తాటికొండ సైదులు, బొజ్జ శ్రీను, బూడిద మల్లికార్జున్, సునీల్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.



నేర నియంత్రణలో సీసీ కెమెరాలది ముఖ్య భూమిక

డీఎస్పీ నాగేశ్వరరావు

నవతెలంగాణ-పెద్దఅడిశర్లపల్లి

సీసీ కెమెరాలు నేర నియంత్రణలో ముఖ్య భూమిక పోషిస్తాయని దేవరకొండ డీఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని హైదరాబాద్-కోదాడ జాతీయ రహదారి 167 చిలుక మర్రి ఎక్స్ రోడ్డు వద్ద సర్పంచు సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమరాలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ కోడాడ జాతీయ రహదారిలో వున్నందు వలన ప్రజల బాధ్యతను గుర్తించి తమ స్వంత ఖర్చులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన గ్రామ సర్పంచ్ కేతావత్ విజయలక్ష్మి మున్నానాయక్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి సీఐ వీ.రవీందర్, గుడిపల్లి ఎస్ఐ ఏ.రంజిత్‌రెడ్డి, వార్డు సభ్యులు, యువజన కాంగ్రెస్స్ పార్టీ దేవరకొండ నియోజకవర్గం నాయకులు కొర్ర బాలకృష్ణ నాయక్, ఇరిగి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



పాపిరెడ్డి మృతికి నివాళులు

నవతెలంగాణ-చిట్యాలటౌన్

చిట్యాల పట్టణ కేంద్రంలోని ఐదవ వార్డుకు చెందిన సామ పాపిరెడ్డి శుక్రవారం రాత్రి మరణించారు. వారి మృతదేహానికి శనివారం చిట్యాల మున్సిపల్ చైర్మెన్ కోమటిరెడ్డి చిన్న వెంకట్‌రెడ్డి, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మెన్ జడల ఆది మల్లయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బెల్లి సత్తయ్య, జమాండ్ల శ్రీనివాసరెడ్డి, మారగోని రమేష్, గోధుమగడ్డ మాధవరెడ్డి, గంటా శ్రీనివాసరెడ్డి, చెరుపల్లి శ్రీనివాస్, ఎస్.శంకర్‌రెడ్డి, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, జంపాల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

యువ టీం ఆధ్వర్యంలో 5కే రన్...

ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే, కుంభం, జిట్టా...

నవ తెలంగాణ- భువనగిరి రూరల్

యువతి ఆధ్వర్యంలో 5 కే రన్ యువ చైతన్యం కార్యక్రమం డ్రగ్స్, బెట్టింగ్ కి వ్యతిరేకంగా నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి ఎమ్మెల్యే పైల శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, బీజేపీరాష్ట్ర నాయకులు జిట్టా బాలకృష్ణా రెడ్డి హాజరయ్యారు. 5కే రన్ కార్యక్రమాన్ని వేర్వేరుగా ప్రారంభించి, మాట్లాడారు. డ్రగ్స్, బెట్టింగ్ కి వ్యతిరేకంగా యువ టీం చేపట్టిన 5కె రన్ లో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఏనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు కొల్పుల అమరెందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్, రాష్ట్ర పిసిసి కార్యదర్శి, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పొత్నక్ ప్రమోద్ కుమార్, కౌన్సిలర్ రత్నపురం బలరాం, పడిగెల ప్రదీప్, జడ్పిటిసి సభ్యులు బీరు మల్లయ్య రోటరీ మెంబర్షిప్ చైర్మన్ యంపల్ల బుచ్చిరెడ్డి, యువ టీం కన్వీనర్ సూదగాని రాజు, యువ టీం సభ్యులు తంగెళ్లపల్లి మోహన్, తదితరులు పాల్గొన్నారు.



బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణా కార్యక్రమం

నవతెలంగాణ-చిట్యాలటౌన్

చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోగికార్ మాధవి ఆధ్వర్యంలో బాలికలకు కరాటే, ఆత్మరక్షణకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. పాఠశాలలో జరుగుతున్న ఈ శిక్షణ కార్యక్రమంలో బాలికలకు కరాటే మాస్టర్ చిరగొని శ్రీశైలం శిక్షకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవి మాట్లాడారు. బాలికలకు ఆత్మరక్షణ అనేది చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీఈటీ ఉపాధ్యాయుడు రవీందర్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ విద్యార్థులపై ఏబీవీపీ దాడి హేయమైన చర్య

మండల కార్యదర్శి వీరన్న

నవతెలంగాణ-దామరచర్ల

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో జరిగిన విద్యార్థి సంఘ ఎన్నికలలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులపై ఏబీవీపీ దాడి చేయడం హేయమైన చర్య అని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వీరన్న అన్నారు. దామరచర్లలో శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎస్ఎఫ్ఐ ఎన్నికల ఫ్యానెల్ పోస్టర్లను ఏబీవీపీ విద్యార్థులు చించివేసినట్లు చెప్పారు. చింపవద్దని అడిగిన ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఆకాశ్‌పై మద్యం మత్తులో విచక్షణ రహితంగా దాడి చేశారని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులున్నారు.

నేడు విద్యా సదస్సు

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

జాతీయ విద్యా విధానం 2002 పై నేడు టీఎన్జీవో భవన్‌లో విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆర్. విజయ్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక డీటీఎఫ్ భవన్‌లో సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో జరుగుతున్న మార్పులు, ప్రత్యన్నమయ్య వ్యవస్థపై సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కే. చక్రధరరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ కే. లక్ష్మీనారాయణలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకులు, ప్రధాన కార్యదర్శి కే. రత్తయ్య, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎండీ. కుర్షీద్ మియా, జిల్లా కార్యదర్శి ఏడుకొండలు, పీడీఎస్‌యూ నాయకులు ఇందూరు సాగర్, తదితరులు పాల్గొన్నారు.